మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు
NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 16-11-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 137 Issue: 137

16 నవంబర్ 2025 - ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు కార్తీక మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:25 సూర్యాస్తమయం - సా. 5:36 తిథిః ద్వాదశి తె. 4:47ం వరకు తరువాత త్రయోదశి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం హస్త రా. 2:06ం వరకు తరువాత చిత్తా యోగం విష్కంభ ఉ. 6:45 వరకు కరణం కౌలవ మ. 3:42 వరకు తైతుల తె. 4:47ం వరకు వర్జ్యం ఉ. 8:53 నుండి ఉ. 10:39 వరకు దుర్ముహూర్తం సా. 4:06 నుండి సా. 4:51 వరకు రాహుకాలం సా. 4:12 నుండి సా. 5:36 వరకు యమగండం మ. 12:00 నుండి మ. 1:24 వరకు గుళికాకాలం మ. 2:48 నుండి సా. 4:12 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:49 నుండి తె. 5:37 వరకు అమృత ఘడియలు రా. 7:31 నుండి రా. 9:17 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:38 నుండి మ. 12:23 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com

# కృష్ణార్జునుల్లా....

# బిల్డప్



## ఒకరిపై ఒకరు బాణాలు వేసుకుంటారు

### వారిద్దరు క్షేత్రస్థాయిలో పెద్దగా చేసిందేమీలేదు

### జూబ్లీహిల్స్ కుట్రలు టైం వచ్చినప్పుడు బయటపెడతా

### మోసం చేసి తప్పించుకోవడం హరీశ్ నైజం

### రామన్నా.. సోషల్ మీడియా మత్తు వదులు

### మరోసారి కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు కృష్ణార్జునులు అని చెప్పుకుంటూ ఒకరిపై ఒకరు బాణాలు వేసుకుంటున్నారని విమర్శించారు. కవిత శనివారం మీడియాతో మాట్లాడుతూ.. తాను 20 ఏళ్లు బీఆర్ఎస్ పార్టీ కోసం పనిచేశానని తెలిపారు.

హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): పార్టీ పెట్టిన, సంస్థను నడిపిన ప్రజల పక్షాన నిలబడటం ముఖ్యమని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా కాంగ్రెస్‌పై వ్యతిరేకత కనిపిస్తుందని... అయినప్పటికీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ భారీ మెజారిటీతో ఎలా గెలిచిందని ప్రశ్నించారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ అనుకున్న స్థాయిలో పనిచేయడం లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో ఉద్యమాలు చేస్తున్నారని... క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వచ్చి ఎలాంటి ఉద్యమాలు చేయడం లేదని విమర్శించారు. పేరుకు కృష్ణార్జునులు(బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు) అని చెప్పుకోవడం తప్పితే పెద్దగా క్షేత్రస్థాయిలో పనిచేసిందేమి లేదని సెటైర్లు తరువాయి 2 వ పేజీలో...



# 50 ఏళ్లైనా బీజేపీకి అధికారం రాదు

## ఎమ్మెల్యే రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు

తెలంగాణలో బీజేపీ మరో 50 ఏళ్ల దాకా అధికారంలోకి రాదు అని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ భారతీయ జనతా పార్టీపై మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితంపై రాజాసింగ్ ఓ వీడియో విడుదల చేశారు. 'బీజేపీ నేతలు మొండితనంతో ముందుకు పోతున్నారు. ఎవరి మాట వినడం లేదు. బీజేపీ నాయకులు వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే ఇంకో 50 ఏళ్ల తర్వాత కూడా తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చేలా కనిపించడంలేదు. ఏ విధంగా గెలవాలి? ఓటరును ఏ విధంగా మన వైపు మల్లించుకోవాలనే విషయాలను నేర్చుకోండి.

హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): ఏదైనా విషయం చెప్తే ఆలోచించండి. తెలంగాణలో బీజేపీ చనిపోతుంది. కిషన్ రెడ్డి గారూ.. దయచేసి కాపాడండి. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానం. అలాంటి చోట కాంగ్రెస్ పార్టీ పక్కా ప్లాన్‌తో పనిచేసి గెలిచింది. గెలవాలనే కసితో కాంగ్రెస్ పనిచేసింది. కానీ, మన బీజేపీ నేతలు మాత్రం ఎన్ని ఓట్లతో ఓడిపోవాలని టార్గెట్ పెట్టుకుని పని చేశారు' అని వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్‌లో ఓటమి ఖాయమని తనకు ముందే తెలుసని, -2 వ పేజీలో...

# నా కుటుంబంతో కటీఫ్

### సంబంధాలు తెంచుకుంటున్నా రాజకీయాల నుంచి వైదొలుగుతున్నా

### లాలూ కుమార్తె రోహిణి ఆచార్య

రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) వ్యవస్థాపకులు లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణి ఆచార్య రాజకీయాల నుంచి పూర్తిగా వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. అంతేకాక, ఆమె తన కుటుంబంతో సంబంధాలు తెంచుకుంటున్నట్లు శనివారం వెల్లడించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ కేవలం 25 సీట్లు మాత్రమే గెలుచుకుని భారీ ఓటమి చవిచూసిన మరుసటి రోజే ఈ ప్రకటన వచ్చింది.



పాట్నా: ఈ మొత్తం పరిణామాలకు బాధ్యత వహిస్తూ, రోహిణి.. తేజస్వీ యాదవ్ సన్నిహితులు సంజయ్ యాదవ్, రమీజ్‌లే కారణమని వ్యాఖ్యానించారు. వారు తనను రాజీనామా చేయాలని, కుటుంబంతో సంబంధాలు తెంచుకోవాలని అడిగారని ఆరోపించారు. 'నేను తరువాయి 2 వ పేజీలో...

# అమెరికాలో బాత్రూంలు కడిగినోడు



### కేటీఆర్‌పై నవీన్ యాదవ్ తండ్రి ఘాటు వ్యాఖ్యలు

జూబ్లీహిల్స్/హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో తన కుమారుడు నవీన్ యాదవ్ గెలుపొందిన అనంతరం ఆయన తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "అమెరికాలో బాత్రూంలు కడిగి వచ్చిన వారికి హైదరాబాద్‌లోని రౌడీలకు, పహిల్వాన్లకు మధ్య తేడా తెలియదు" అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా కేటీఆర్ తనపైనా, తన తరువాయి 2 వ పేజీలో...

# అహంకారం అంటే అదే!



### కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీతోనే తెలిసింది

### మేం గెలిచినప్పుడు కాంగ్రెస్ గుర్తును గాడిదై ఊరేగించామా?

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాలు వచ్చి 24 గంటలు గడవకముందే కాంగ్రెస్ పార్టీ రౌడీయిజం, గుండాయిజం మొదలుపెట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తపై జరిగిన దాడిని ఖండించారు. తాము పదేండ్లు అధికారంలో ఉన్నామని, ఎన్నో ఉప ఎన్నికలు, స్థానిక తరువాయి 2 వ పేజీలో...

# ఈవీఎంలే ఓట్లేసుకున్నాయేమో!



### బీహార్ ఓటమిపై కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి

హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): బీహార్ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి స్పందించారు. మహాఘట్‌బంధన్ ఓటమిపై మాట్లాడుతూ.. పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రజలు ఓట్లేశారా? లేక ఈవీఎం మెషీన్లే ఓట్లు వేసుకున్నాయా? అన్నది అర్థం కాలేదని వ్యాఖ్యానించారు. బీహార్‌లో ఏం జరుగుతుందో, ప్రజలు ఎటు ఓటేశారో అర్థం కావడం లేదని అన్నారు. అనేక అనుమానాల మధ్య ఎన్నికల కమిషన్ పనిచేస్తోందని తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,508 |
| వెండి (గ్రాము): | రూ.175 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,393 |

# ఇప్పుడేం చేద్దాం?

### వ్యూహాత్మక చర్యలపై బీఆర్ఎస్ ఫోకస్.. ఎర్రవల్లి ఫాంహౌస్‌లో కేసీఆర్, కేటీఆర్ భేటీ

### జూబ్లీహిల్స్ ఓటమిపై కీలక సమీక్షలు.. క్యాడర్‌తో కేటీఆర్ సమావేశానికి సిద్ధం

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఎదురైన ఓటమి నేపథ్యంలో పార్టీ వ్యూహాత్మక చర్యలు వేగం పెంచింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్ రావు ఎర్రవల్లి ఫాంహౌస్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో సమావేశమయ్యారు. ఓటమి కారణాలు, తదనంతర పరిణామాలు, భవిష్యత్ వ్యూహాలపై కేసీఆర్ కేటీఆర్‌తో సమీక్షించినట్లు సమాచారం.

గజ్వేల్, నవంబర్ 15 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ బైపోల్స్ ఫలితాలు పార్టీ అంచనాలను తలకిందులు చేసిన నేపథ్యంలో, స్థానిక నాయకత్వం, క్యాడర్ స్థాయి బలహీనతలు, ప్రచార తీరుపై కేసీఆర్ ఆరా తీసినట్లు తెలుస్తోంది. బైఎలక్షన్లలో ఎదురైన ప్రతికూలతల నుంచి బయటపడడానికి ఏ మార్పులు అవసరమో పార్టీ అగ్రనేతలు అంతర్గతంగా చర్చించినట్టు వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా, కేటీఆర్ స్వయంగా జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశంకానున్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించనున్న ఈ సమావేశానికి స్థానిక క్యాడర్‌ను భారీ సంఖ్యలో ఆహ్వానించారు. ఓటమి నేపథ్యంలో తరువాయి 2 వ పేజీలో...



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఢిల్లీలో రాహుల్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిసిన నవీన్ యాదవ్, సీఎం రేవంత్. చిత్రంలో ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్, ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రోహిన్ రెడ్డి.

## విశ్వవాణి



వారానికి ఒకటి కంటే ఎక్కువ గుడ్డు తింటే మతిమరుపు 47 శాతం తగ్గిపోతుందని తాజా అధ్యయనంలో తేలింది. దాదాపు 1,024 మంది వృద్ధులపై చేసిన పరిశోధనల్లో ఈ విషయం తెలిసింది. గుడ్డులో ఉండే కోలిన్ అనే పదార్థం మెమరీ, మెదడు పనితీరును మెరుగుపరుస్తుందని.. దాంతో జ్ఞాపకశక్తికి గుడ్డు ప్రయోజనకారిగా ఉంటుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

iBOMMA

# ఐబొమ్మ నిర్వాహకుడి అరెస్టు

### 14 రోజుల రిమాండ్.. చంచల్‌గూడ జైలుకు తరలింపు

పైరసీ సినిమాల వెబ్‌సైట్.. 'ఐబొమ్మ' ప్రధాన నిర్వాహకుడు ఇమ్మడి రవిని తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఫ్రాన్స్ నుంచి హైదరాబాద్ వచ్చిన అతడిని సైబర్ క్రైమ్ పోలీసులు కూకట్‌పల్లిలో అదుపులోకి తీసుకున్నారు. రవి కరేబియన్ దీవుల్లో ఉంటూ ఐబొమ్మ వెబ్‌సైట్‌ను నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): అరెస్ట్ అనంతరం ఆయన అకౌంట్లో ఉన్న రూ.3 కోట్లు ఫ్రీజ్ చేసినట్లు తెలిపారు. తెలుగు సినిమాలను పైరసీ చేయడంపై గతంలో ఐ-బొమ్మపై తెలుగు ఫిల్మ్ యాంటీ పైరసీ టీమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతంలో ఈ వెబ్‌సైట్ కోసం పనిచేస్తున్న ఏజెంట్లను బీహార్, ఉత్తరప్రదేశ్‌లో తరువాయి 2 వ పేజీలో...

# చట్టబద్ధమనే ప్రమోట్ చేశా

### బెట్టింగ్ యాప్‌లపై రానా.. సీఐడీ సిట్ ఎదుట హాజరు



హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): చట్టబద్ధమైన యాప్ అని తెలుసుకున్న తర్వాతే బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేశానని నటుడు రానా తెలిపారు. దానిపై తన న్యాయ బృందం పూర్తిగా విచారణ చేసిందన్నారు. సంబంధిత వివరాలను సీఐడీ అధికారులకు వివరించానని చెప్పారు. సీఐడీ సిట్ అధికారులతో విచారణ పూర్తయిన అనంతరం రానా మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో తరువాయి 2 వ పేజీలో...



# బీసీల కోసం రాజ్యాంగాన్ని సవరించాలి

### 42 శాతం రిజర్వేషన్ ఇచ్చి తీరాల్సిందే.. రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్

భారత రాజ్యాంగాన్ని 130 సార్లు సవరించారిన, 56 శాతం జనాభా ఉన్న బీసీల కోసం మరోసారి సవరించాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ జేఏసీ చైర్మన్ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ జేఏసీ కో ఆర్డినేటర్ గుజ్జ సత్యం అధ్యక్షతన శనివారం కాచిగూడలోని హోటల్‌లో బీసీ,కుల,ఉద్యోగ,విద్యార్థి సంఘాలతో సమావేశాన్ని నిర్వహించారు.

## రాశి ఫలాలు

16.11.2025

మేషం: నూతన వాహనం కొనుగోలు చేస్తారు. సన్నిహితులతో వివాదాలు తొలగుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. వ్యాపార, ఉద్యోగాలు ఉత్సాహవంతంగా సాగుతాయి. సన్నిహితుల నుండి ఆసక్తికరమైన సమాచారం అందుతుంది. కుటుంబ సభ్యులతో శుభకార్య ఆహ్వానాలు అందుతాయి.

వృషభం: చేపట్టిన పనుల్లో తొందరపాటు మంచిది కాదు. వ్యాపారాలు, ఉద్యోగాలలో సమస్యలు తప్పవు. కుటుంబ సభ్యులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. దైవ దర్శనాలు చేసుకుంటారు. ధన వ్యవహారాలలో జాగ్రత్త అవసరం. సంతాన ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

మిధునం: బంధువులతో మాటపట్టింపులు ఉంటాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఒత్తిడులు ఉంటాయి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. ఆలయాలు సందర్శిస్తారు. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత తప్పదు. కుటుంబ సభ్యులతో వివాదాలు కలుగుతాయి.

కర్కాటకం: వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలుచేస్తారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. నూతన వాహనయోగం ఉన్నది. వ్యాపారాలు, ఉద్యోగాలు సంతృప్తినిస్తాయి. కీలక సమయంలో స్వంత ఆలోచనలు కలసివస్తాయి. సంఘంలో గౌరవమర్యాదలకు లోటు ఉండదు.

సింహం: వ్యాపార, ఉద్యోగాలలో కొద్దిపాటి సమస్యలు తప్పవు. ఆరోగ్యపరంగా వైద్య సంప్రదింపులు అవసరమవుతాయి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. బంధువులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. వృధా ఖర్చులు అదుపు చేయడం మంచిది.

కన్య: కుటుంబమునకు ఆశ్చర్యకరమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. ప్రముఖులతో పరిచయాలు సంతోషానిస్తాయి. ముఖ్యమైన పనుల్లో విజయం సాధిస్తారు. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. జీవిత భాగస్వామితో శుభకార్యాలలో పాల్గొంటారు. రావలసిన సొమ్ము సకాలంలో చేతికి అందుతుంది.

తుల: వ్యాపారాలలో ఒత్తిడులు తొలగుతాయి. చేపట్టిన పనులలో స్వల్ప ఆటంకాలు ఉంటాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక ఇబ్బందుల వలన నూతన ఋణప్రయత్నాలు చేస్తారు. ఉద్యోగాలలో కొద్దిపాటి సమస్యలు తప్పవు. వ్యయప్రయాసలతో కానీ పనులు పూర్తి కావు.

వృశ్చికం: ఉద్యోగాలలో పురోగతి సాధిస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి. చిరు వ్యాపారులకు ఆశించిన లాభాలు అందుతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ధన సహాయం అందిస్తారు. చిన్ననాటి మిత్రులతో గృహమున ఆనందంగా గడుపుతారు.

ధనస్సు: సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. ధన వ్యవహారాలలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

మకరం: వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ఉద్యోగాలు కొంత నిరాశ కలిగిస్తాయి. చిన్ననాటి మిత్రులతో అకారణ వివాదాలు కలుగుతాయి. ఆరోగ్య విషయాలలో శ్రద్ధ వహించాలి. ఆదాయ మార్గాలు అంతంతమాత్రంగా ఉంటాయి. చేపట్టిన పనులలో ఆటంకాలు తప్పవు.

కుంభం: వ్యాపార ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి. దైవ సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉంటుంది. బంధువులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. వ్యయప్రయాసలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. దాని పరంగా ఇబ్బందులు తప్పవు.

మీనం: దూరపు బంధువుల ఆగమనం కలిగిస్తుంది. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. ప్రముఖులతో పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఒత్తిడులు తొలగుతాయి. కీలక సమయంలో ఆప్తుల సలహాలు స్వీకరిస్తారు. సంతానానికి నూతన విద్యా ఉద్యోగ అవకాశాలు దక్కుతాయి.

# కృష్ణార్జునుల్లా.. బిల్డప్

మొదటి పేజీ తరువాయి

వేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కుట్రలు కూడా జరిగాయని, వాటి గురించి సమయం వచ్చినప్పుడు బయటపెడతామని కవిత చెప్పారు. ప్రతిపక్షాలు ప్రజలు ఆశించిన మేరకు పనిచేస్తే... జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం వేరే రకంగా ఉండేదని అన్నారు. అలాంటి పరిస్థితులలో ప్రజల తరఫున నిలబడేందుకు తెలంగాణ జాగృతి జనం బాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. "జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో నాకు సంబంధం లేదని చెప్పాను. అయినప్పటికీ 15 మంది స్వతంత్ర అభ్యర్థులు నా దగ్గరకు వచ్చి మేము విత్ డ్రా చేసుకుంటాం.. ఎవరికి సపోర్టు చేయమంటారని అడిగారు. అప్పుడు నాకు సంబంధం లేదని, మీరు ఎవరి దగ్గరికైనా వెళ్లండి అని చెప్పాను. అప్పుడు వాళ్లు హరీశ్ అన్న దగ్గరకు వెళ్లారు. అయితే ఆయన కూడా వాళ్ల ఇష్టమొచ్చిన వాళ్లకు సపోర్టు చేసుకోమని చెప్పారు. ఈ విషయం అదే స్వతంత్ర అభ్యర్థులు నాకు చెప్పారు. నేను బీఆర్ఎస్‌లో లేను కాబట్టి ఎవరికైనా సపోర్టు చేసుకోమని చెప్పాను. కానీ హరీశ్ రావు కూడా అదే మాట చెప్పారు. అంటే బీఆర్ఎస్‌ను మోసం చేసినట్టే కదా? అంతేకాకుండా ఎన్నికలకు ముందే.. ఫలానా వ్యక్తిని అభ్యర్థిగా పెడితే మీకు సపోర్టు చేస్తానని కాంగ్రెస్ పైవాళ్లతో హరీశ్ రావు చెప్పాడట. అయితే వాళ్లు ఆ క్యాండిడేట్ వద్దని అన్నారట. దీంతో హరీశ్ రావు సైలెంట్ అయ్యారు. హరీశ్ రావు ఏ పనిచేసినా అది ఇతరులు తెలుసుకోవడానికి టైమ్ పడుతుంది. దురదృష్టవశాత్తూ, ఇటీవల హరీశ్ రావు తండ్రి మరణించారు. ఆ సమయంలో హరీశ్ రావు ఇంట్లో ఉండే. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారానికి సంబంధించిన టెలికాన్ఫరెన్స్‌లలో పాల్గొన్నారు. అప్పుడు హరీశ్ రావు ఇంత కష్టంలో ఉండి కూడా పార్టీ కోసం కష్టపడుతున్నారని ఆయన భజనపరులు పోస్టులు చేశారు. మళ్లీ నిన్నటి నుంచి హరీశ్ అన్న లేకపోయేసరికి జూబ్లీహిల్స్ ఓడిపోయామని పోస్టులు పెడుతున్నారు. అప్పటివరకు మోసం చేసి వెంటనే



తప్పించుకోవడం హరీశ్ రావు నైజం. ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలేడనే సంగతి తెలిసిందే. ఇది నాకు తెలిసి గట్టిగా మాట్లాడుతున్నందుకు పార్టీ నుంచి బయటకు పంపేశారు. రామన్న (కేటీఆర్) కూడా ఒక్క మీటింగ్ అయిపోయిన వెంటనే సార్(కేసీఆర్)ను ఆయన మోసినట్టుగా, హరీశ్ రావు మోసినట్టుగా ప్రచారం చేసుకున్నారు. మేము సార్ ముందట బచ్చాగాళ్లం. బచ్చాగాళ్లం బచ్చాగాళ్ల లెక్కన ఉంటే మంచింది. నన్ను బయటకు పంపడంతో నేను నెత్తిమీద తెలంగాణ సమస్యలు ఎత్తుకుని తిరుగుతున్నాను. అందుకే బలంగా మాట్లాడుతున్నాను. పద్మ దేవేందర్ రెడ్డి 2009లో ఎక్కడున్నారు? పార్టీ టికెట్ ఇవ్వకపోతే కేసీఆర్ మీద దుమ్మెత్తిపోసి వెళ్లిపోయారు. మళ్లీ కేసీఆర్ దీక్ష చేసి, ఉద్యమం ఉధృతంగా మారడంతో తిరిగి వాపస్ వచ్చింది. దేవేందర్ రెడ్డికి హరీశ్ రావు సపోర్టు. మోసపూరితమైన పోరాటం చేయడం మానుకోవాలి. కేటీఆర్ సోషల్ మీడియా, ట్విట్టర్ విడిచిపెట్టి గ్రౌండ్‌లోకి రావాలి. హరీశ్ రావు మోసం చేయడం మానేసి, కృష్ణుడి పాత్రనో, అర్జునుడి పాత్రనో నిర్ణయించుకుని నేరుగా ఫైట్ చేయాలి. కేటీఆర్, హరీశ్ రావులు పేరు కృష్ణార్జునలు అని చెప్పుకుని, ఒకరి మీద ఒకరు బాణాలు వేసుకుంటే ఎలా? ఇందుకు బీఆర్ఎస్ శ్రేణులు బలి అవుతున్నారు. వీళ్లు ఒకరిపై ఒకరు బాణాలు వేసుకుని పక్క పార్టీ మీద బాణాలు వేయరు. బీఆర్ఎస్ కార్యకర్తలు చాలా మంది నాతో కలిసి నడుస్తామని అంటున్నారు. జగదీష్ రెడ్డి, మదన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, నిరంజన్ రెడ్డి ఎవరు? వాళ్లకు గతంలో ఏముంది? ఇప్పుడు వాళ్లు ఎలా ఉన్నారు? పార్టీ కార్యకర్తల పరిస్థితి ఎలా ఉంది? నా విషయానికి వస్తే 2014 కి ముందు, ఇప్పుడు నా ఆస్తులను మీరు తనిఖీ చేసుకోవచ్చు. ఈడీ, సీబీఐ తనిఖీలు చేశాయి. నా దగ్గర ఏమైనా అదనంగా ఆస్తులు గుర్తించాయా?' అని కవిత ప్రశ్నించారు.



# బీసీల కోసం రాజ్యాంగాన్ని సవరించాలి

## 42 శాతం రిజర్వేషన్ ఇచ్చి తీరాల్సిందే.. రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్

కాచిగూడ/హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): భారత రాజ్యాంగాన్ని 130 సార్లు సవరించారిన, 56 శాతం జనాభా ఉన్న బీసీల కోసం మరోసారి సవరించాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ జేఏసీ చైర్మన్ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ జేఏసీ కోఆర్డినేటర్ గుజ్జ సత్యం అధ్యక్షతన శనివారం కాచిగూడలోని హెూటల్‌లో బీసీ,కుల,ఉద్యోగ,విద్యార్థి సంఘాలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం సీఎం రేవంత్‌రెడ్డి అఖిల పక్షాన్ని ప్రధానమంత్రి వద్దకు తీసుకెళ్లి నిజాయితీని నిరూపించుకోవాలని సూచించారు. దేశంలో తెలంగాణ ఉద్యమం తరువాత బీసీ ఉద్యమమే ఉవ్వెత్తున ఎగిసిందని పేర్కొన్నారు. రాజ్యాంగ సవరణ చేసి, బీసీ రిజర్వేషన్ల బిల్లును శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే అమోదించి,తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఆర్టికల్ 243 డీ6 ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వానికి అధికారం ఉన్నప్పటికి సీఎం బీసీ రిజర్వేషన్లపై కోర్టుల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లాలని, పార్టీ పరంగా వద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

## నా కుటుంబంతో కటీఫ్

మొదటి పేజీ తరువాయి

రాజకీయాల నుంచి తప్పుకుంటున్నాను నా కుటుంబాన్ని వదిలేస్తున్నాను. సంజయ్ యాదవ్ రమీజ్ నన్ను ఇదే చేయమని అడిగారు. అందుకే ఈ నిందనంతా నేనే తీసుకుంటున్నాను' అని రోహిణి 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. రోహిణి వైద్య పట్టభద్రురాలు. వివాహం తర్వాత గృహిణిగా మారి సింగపూర్‌లో స్థిరపడ్డారు. ఆమె తన తండ్రికి కిడ్నీ దానం చేసి ప్రజల గౌరవాన్ని పొందారు. ఆర్జేడీ శిబిరంలో ఆమెకు ప్రభావవంతమైన వాయిస్ ఉంది. గత సంవత్సరం, ఆమె తన తండ్రి గతంలో ప్రాతినిధ్యం వహించిన సారన్ లోక్‌సభ స్థానం నుంచి ఆర్జేడీ టికెట్‌పై పోటీ చేసి బీజేపీ అభ్యర్థి రాజీవ్ ప్రతాప్ రూడీ చేతిలో ఓడిపోయారు. అయితే, ప్రస్తుతం రోహిణి వ్యాఖ్యలు యాదవ్ కుటుంబంలో ఉన్న విభేదాలను బహిర్గతం చేశాయి. ఈ సంవత్సరం మొదట్లో, లాలూ ప్రసాద్ తన పెద్ద కుమారుడు, మాజీ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్‌ను ఒక సోషల్ మీడియా పోస్ట్ వివాదం కారణంగా ఆరు సంవత్సరాలపాటు పార్టీ నుంచి బహిష్కరించారు. బహిష్కరణ తర్వాత, తేజ్ ప్రతాప్ జనశక్తి జనతా దళ్ అనే కొత్త పార్టీని స్థాపించి, ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేశారు. అంతేకాక, ఆయన తేజస్వీ యాదవ్‌కు వ్యతిరేకంగా కూడా అభ్యర్థిని నిలబెట్టారు. అయితే, ఆయన పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఒక్క సీటును కూడా గెలుచుకోలేకపోయింది. తేజ్ ప్రతాప్ కూడా తన సొంత స్థానం మహువాలో ఓడిపోయారు.

## ఈవీఎంలే ఓట్లేసుకున్నాయేమో!

మొదటి పేజీ తరువాయి

ఆరోపించారు. అయితే, జగ్గారెడ్డి వ్యాఖ్యలపై నెట్టింట్లో కౌంటర్లు పేలుతున్నాయి. బీహార్‌లో ఈవీఎం మెషీన్లు ఓట్లేసుకుంటే.. జూబ్లీహిల్స్‌లో కూడా వేసుకున్నట్లేగా! అని కౌంటర్ ఇస్తున్నారు. ఈవీఎం మెషీన్లే ఓట్లు వేసుకుంటే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఎలా గెలిచింది? అని నిలదీస్తున్నారు.

## 50 ఏళ్లైనా బీజేపీకి అధికారం రాదు

మొదటి పేజీ తరువాయి

ఈ విషయాన్ని కిషన్ రెడ్డికి కూడా ముందే చెప్పానని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ ఓటమికి ఎవరు బాధ్యత తీసుకుంటారని రాజాసింగ్ ప్రశ్నించారు. 'రాబోయే జీహెచ్ఎంసీ, లోకల్ బాడీ ఎన్నికల పరిస్థితి ఏంటి? అక్కడ కూడా ఇలాంటి ఫలితాలే వస్తే పార్టీ కార్యకర్తలు, నేతలు ఎక్కడికి పోవాలి?' అని ప్రశ్నించారు. తాను కిషన్ రెడ్డిని వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం లేదని, సొంత పార్టీ నాశనం అవుతుందన్న బాధతోనే ఈ మాటలు అంటున్నానని స్పష్టం చేశారు. 'నేను పార్టీలోకి తిరిగి రాను. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానో లేదో కూడా తెలియదు. కానీ, ఇది నా పార్టీ. కళ్ల ముందే పార్టీని ముంచేస్తుంటే చూస్తూ ఊరుకోలేను. ఇప్పటికైనా పెద్దలు తమ పంతాలు వీడి పార్టీని కాపాడాలి' అని ఆయన కిషన్ రెడ్డి, బండి సంజయ్, లక్ష్మణ్ కు విజ్ఞప్తి చేశారు. అలాగే, జూబ్లీహిల్స్ లో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌కు రాజాసింగ్ శుభాకాంక్షలు తెలిపారు.

## అమెరికాలో బాత్రూంలు కడిగినోడు

మొదటి పేజీ తరువాయి

కుమారుడిపైనా చేసిన ఆరోపణలపై ఆయన మీడియాతో మాట్లాడారు. తాము గత 48 ఏళ్లుగా ప్రజల మధ్యనే ఉన్నామని, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ప్రతి సమస్యపై తమకు పూర్తి అవగాహన ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. భవిష్యత్తులో జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే తన కుమారుడి లక్ష్యమని చిన్న శ్రీశైలం యాదవ్ తెలిపారు. ముఖ్యంగా యువతకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్ల తమ పోరాటానికి లభించిన ఫలితమే ఈ విజయమని చెబుతూ భావోద్వేగానికి గురయ్యారు.

## ఇప్పుడేం చేద్దాం?

మొదటి పేజీ తరువాయి

క్యాడర్‌లో నెలకొన్న అసంతృప్తి, స్థానిక స్థాయి లోపాలు, ప్రచార వ్యూహాలు, భవిష్యత్ బలోపేత కార్యక్రమాలపై కేటీఆర్ నేరుగా పార్టీ కార్యకర్తలతో చర్చించనున్నారు. జూబ్లీహిల్స్ ఓటమిని పాఠంగా తీసుకుని, పార్టీని మళ్లీ పటిష్టం చేయడానికి అవసరమైన చర్యలను ఈ సమీక్షల ద్వారా బీఆర్ఎస్ నిర్ణయించనున్నట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

## ఐబొమ్మ నిర్వాహకుడి అరెస్టు

మొదటి పేజీ తరువాయి

అదుపులోకి తీసుకోగా.. తాజాగా రవిని అరెస్టుచేశారు. అతడిని నాంపల్లి కోర్టుకు తరలించి జడ్జి ఎదుట ప్రవేశపెట్టారు. విచారించిన జడ్జి ఐబొమ్మ నిర్వాహకుడికి 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు అతడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. 2019 నుంచి 'ఐబొమ్మ' వెబ్‌సైట్‌లో పైరసీ సినిమాలను అప్లోడ్ చేస్తూ భారీ నెట్‌వర్క్‌ను నడిపినందుకు రవి ప్రధాన నిందితుడిగా గుర్తించారు. థియేటర్‌లలో కొత్తగా విడుదలైన సినిమాలను గంటల వ్యవధిలోనే వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేసే పెద్ద సర్కిల్‌ను అతడు నడిపేవాడని పోలీసులు వెల్లడించారు. ఆరేళ్లలో వేలాది సినిమాలను పైరసీ చేసి అప్లోడ్ చేయడంతో టాలీవుడ్‌కు దాదాపు రూ.3 వేల కోట్లు నష్టం జరిగినట్లు అంచనా వేశారు. ఇమ్మడి రవి స్వస్థలం విశాఖపట్నంగా పోలీసుల విచారణలో వెల్లడైంది.

## చట్టబద్ధమనే ప్రమోట్ చేశా

మొదటి పేజీ తరువాయి

బెట్టింగ్‌యాప్‌ల నిర్వాకాలపై దర్యాప్తు జరిపేందుకు ప్రభుత్వం సీఐడీ ఆధ్వర్యంలో సిట్ ను ఏర్పాటు చేసింది. కాగా, హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయంలో అధికారులు రానా స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. అటు.. యాంకర్ విష్ణుప్రియ కూడా మూడు బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. శనివారం ఆమె కూడా విచారణకు హాజరైంది. విచారణలో భాగంగా ఆమె తన బ్యాంకు ఖాతా వివరాలతో పాటు, బ్యాంక్ స్టేట్‌మెంట్లను కూడా సిట్ అధికారులకు సమర్పించినట్లు తెలిసింది. ఈ ప్రమోషన్ల కోసం చేసుకున్న ఒప్పందాలు, వాటి ద్వారా పొందిన ఆదాయంపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు.

# అహంకారం అంటే అదే!

మొదటి పేజీ తరువాయి

సంస్థల ఎన్నికల్లో గెలుపొందినా ఎప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ వలే ప్రతిపక్షాలపై దాడులు చేయలేదన్నారు. జూబ్లీహిల్స్ రహమత్‌నగర్‌లో కాంగ్రెస్ గూండాల దాడిలో గాయపడిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త రాకేశ్‌ను కేటీఆర్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కార్యకర్తలు ఎవ్వరూ దిగులు చెందొద్దని, కాంగ్రెస్ చేస్తున్న రౌడీయిజాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీలోని ప్రతి కార్యకర్తను కంటికిరెప్పలా కాపాడుకుంటామని చెప్పారు. ఆపదొస్తే అన్ని వేళల్లో అండగా ఉంటాని తెలిపారు. తమ కార్యకర్తపై జరిగిన దాడికి కాంగ్రెస్ బాధ్యత తీసుకోవాలన్నారు. దొంగ ఓట్లు, గూండా గిరి చేసి, డబ్బులు పంచి జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ గెలిచిందని చెప్పారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో తమకు గతంలో 80 వేలు ఓట్లు వస్తే ఈ ఉప ఎన్నికలో 75 వేల ఓట్లు వచ్చాయని, ఇన్ని కుట్రలు, రిగ్గింగ్ చేసినా మా ఓట్లు కేవలం 5 వేలు మాత్రమే తగ్గాయన్నారు. కచ్చితంగా భవిష్యత్తులో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరవేసి తీరుతామని స్పష్టం చేశారు. తాను అహంకారం తగ్గించుకోవాలన్న రేవంత్ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. శుక్రవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ చేసిన విజయోత్సవ ఊరేగింపుతోనే ఎవరిది అహంకారమో తేలిపోయిందని కేటీఆర్ అన్నారు. గతంలో మేము అనేక ఉప ఎన్నికలు గెలిచాము, కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా రాలేదు. అందుకని ఆ పార్టీ గుర్తును గాడిద మీద వేసి ఊరేగించామా అని ప్రశ్నించారు. ఒక్క ఉప ఎన్నిక గెలిచినందుకే ఇంత ఎగిరి పడడం అవసరం లేదని చురకలంటించారు. ఎవరిది అహంకారమో ప్రజలు నిర్ణయిస్తారన్నారు. జూబ్లీహిల్స్ నేతలు, కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించానున్నామని చెప్పారు. కాంగ్రెస్ గుండాయిజం మానుకోకపోతే బుద్ధి చెబుతారన్నారు.

## విద్య, ఉద్యోగవాణి

### 15 వేల పోస్టులు

దేశవ్యాప్తంగా కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీఎస్), నవోదయ విద్యాలయ సమితి (ఎన్వీఎస్)లలో ఖాళీగా ఉన్న దాదాపు 15 వేల పోస్టుల భర్తీకి సీబీఎస్ఈ నోటిఫికేషన్ విడుదల చేసింది. టీచింగ్, నాన్ %-% టీచింగ్ పోస్టుల భర్తీకి ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ నెల 14 నుంచే ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకునే వీలు కల్పించింది. దరఖాస్తులకు తుది గడువు డిసెంబర్ 4 గా పేర్కొంది. అసిస్టెంట్ కమిషనర్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (పీజీటీఎస్), ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ సహా లైబ్రేరియన్ వంటి నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపింది. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ లో 9,126 పోస్టులు, నవోదయ విద్యాలయ సమితిలో మొత్తం 5,841 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పేర్కొంది.

భాగ్యనగరానికి సమీపంలోని ఆ ప్రాంతం ప్రసిద్ధ పర్యాటకంగా పేరుగాంచింది. కోరిన కోర్కెలు తీర్చే ఆంజనేయుడిగా ఆ గుట్ట ఎంతో పేరొందింది. తన చెంతకు వచ్చే భక్తులకు అభయం ఇస్తున్నాడు ఆ హనుమంతుడు. 250 ఏళ్ల చరిత్ర కలిగింది ఆ దేవాలయం. ఎంతో ప్రసిద్ధి గాంచిన ఈ సన్నిధిలో.. కొన్ని రోజులుగా అసాంఘిక కార్యక్రమాలకు కేంద్రంగా మారింది. వెడ్డింగ్ షూట్స్ మాటునా అభ్యంతరకర కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.



# కోహెడగుట్టలో కామక్రీడలు

**అంజన్న సన్నిధిలో అసాంఘిక కార్యకలాపాలు.. 250 ఏళ్ల చరిత్ర కలిగిన ఆంజనేయుడి సన్నిధి**

**కోరిన కోర్కెలు తీర్చే చల్లని భగవంతుడిగా కీర్తి.. వెడ్డింగ్ షూట్స్‌కి స్పాట్‌గా కోహెడగుట్ట**

**దైవసన్నిధిలో అభ్యంతరకరంగా షూటింగ్స్.. దేవాలయ పరిసరాల్లో సిగరెట్లు, కండోమ్ ప్యాకెట్లు**

**గుట్టపై చికెన్ పార్టీలు చేసుకుంటున్న చిల్లర బ్యాచ్.. ఆలయ పరిధిలో లోపించిన పర్యవేక్షణ, నియంత్రణ**



రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ సమీపంలోని కోహెడగుట్ట తెలంగాణలో ఎంతో పేరొందింది. గుట్టపై వెలసిన ఆంజనేయుడు చారిత్రక నేపథ్యం కలిగి ఉన్నారు. ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ కమిటీ ఈ ఆలయ నిర్వహణను చూస్తోంది. ప్రకృతి ప్రేమికులు స్వామివారి దర్శనం చేసుకొని, కొండపై ఉన్న అహ్లాదాన్ని చూసి ఎంతో అనుభూతి చెందుతారు. మానసిక ప్రశాంతకు కేంద్రబిందుగా మారిందని పలువురు భక్తులు చెప్తుంటారు. గుట్టపైకి ఎక్కి అలా ప్రకృతిని చూస్తుంటే.. కనుచూపు మేర అంతా పచ్చని చెట్లు, చల్లని గాలులు, పక్షుల కిలకిలలే వినిపిస్తాయి. హైదరాబాద్‌కి సమీపాన ఉన్నటువంటి ఇంత చక్కటి ప్రదేశానికి ఎందరో భక్తులు వచ్చి పోతుంటారు. దీన్ని గమనించిన తెలంగాణ ప్రభుత్వం కొంత మేర అభివృద్ధి చేసింది. అప్పటి నుంచి భక్తుల తాకిడి మరింతగా పెరిగింది. అయితే.. ప్రస్తుత కాలంలో ఈ కోహెడగుట్ట జులాయిలకు అడ్డాగా మారింది. అసాంఘిక కార్యక్రమాలకు కేరాఫ్‌గా మారింది. నూతనంగా వివాహాలు చేసుకునేవారు వెడ్డింగ్ షూట్స్ చేస్తున్నారు. ప్రేమికులు, అవారా బ్యాచ్ ఈ స్పాట్‌ని కేంద్రంగా చేసుకొని లైంగిక కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఆలయ సమీపంలోనే చికెన్ పార్టీలు, మటన్ పార్టీలు, మందుచిందులకు అడ్డాగా మార్చుకున్నారు. భగవంతుడి సన్నిధిలో ఈ విధమైన కార్యకలాపాలపై ఆలయ కమిటీ దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసుల రక్షణ కార్యక్రమాలు కూడా లోపించాయి. ఆలయానికి రక్షణ కల్పించాల్సిన అధికారులు కూడా పత్తా లేరు. సిగరెట్లు, కండోమ్ ప్యాకెట్లు, మాంసపు అవశేషాలు ఈ గుట్ట సమీపంలో దర్శనమిస్తున్నాయి. దైవ సన్నిధిలో.. ఎంతో నిష్ఠగా భక్తిగా ఉండాల్సిన చోట.. ఈ వికృత కార్యకలాపాలేంటని భక్తులు మండిపడుతున్నారు. వెడ్డింగ్ షూట్స్ కూడా అభ్యంతరకంగా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అటు వెడ్డింగ్ షూట్స్‌కి వచ్చే వారి నుంచి ఆలయ కమిటీ ఎలాంటి రుసుము తీసుకోవడం లేదు. దీంతో ఆలయ నిర్వహణ కొంత మేర కష్టంగా మారిందని తెలుస్తోంది. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ అధికారులు కూడా ఏమాత్రం పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తే కోహెడగుట్ట హైదరాబాద్ పరిధిలో ఎంతో అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. అసాంఘిక శక్తులపై పోలీసులు దృష్టి సారించాలని హనుమాన్ భక్తులుకోరుతున్నారు.




## జనవరి 10 నుంచి 15 వరకు సంక్రాంతి సెలవులు

హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): సంక్రాంతి దగ్గరపడ్తుంటేనే తెలుగు రాష్ట్రాల్లో పండుగ వాతావరణం మొదలైపోతుంది. కుటుంబం అంతా ఒకేచోట చేరి సందడిగా జరుపుకునే ఈ పండగ కోసం పెద్దలు, చిన్నలు, ముఖ్యంగా విద్యార్థులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తారు. ఈసారి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కూడా స్కూళ్లకు పెద్దఎత్తున సంక్రాంతి సెలవులు ఉండటంతో పండుగ ఉత్సాహం మరింత పెరిగింది. ఈసారి కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం జనవరి 10 నుంచి జనవరి 18, 2026 వరకు మొత్తం 9 రోజులపాటు పాఠశాలలు మూసివేయనున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు ఇదే షెడ్యూల్ వర్తిస్తుంది. తిరిగి జనవరి 19న స్కూల్లు తిరిగి ప్రారంభమవుతాయి. అదే సమయంలో, తెలంగాణలో కూడా జనవరి 10 నుంచి 15 వరకు సంక్రాంతి సెలవులను ప్రకటించే అవకాశం ఉంది. దీనిపై అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుంది. సంక్రాంతి సెలవులు వచ్చిన వెంటనే పిల్లలు అమ్మమ్మలు, నానమ్మలు ఉన్న సొంతూళ్లకు వెళ్లి పండగను ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీ. అందుకే తల్లిదండ్రులు ముందుగానే బస్సు, రైలు టికెట్లు బుక్ చేస్తూ ప్లాన్లు సిద్ధం చేసుకుంటున్నారు. పెద్ద ఎత్తున ప్రయాణాలు ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక సర్వీసులను కూడా నడుపుతున్నాయి. అదనంగా, జనవరి 23న వసంత పంచమి, సరస్వతి పూజ, సుభాష్ చంద్రబోస్ జయంతి.. జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా కూడా పాఠశాలలకు వరుస సెలవులు రానున్నాయి.

# ఏరో ఇంజిన్ రాజధానిగా తెలంగాణ

**2030 నాటికి తీర్చిదిద్దేలా కాంప్రెహెన్సివ్ రోడ్డు మ్యాప్**

**'ఏరోస్పేస్, డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ సమ్మిట్'లో మంత్రి శ్రీధర్ బాబు**



హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): 2030 నాటికి తెలంగాణను దేశ "ఏరో ఇంజిన్ రాజధాని"గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఇందుకోసం ప్రపంచంతో పోటీపడేలా దిగ్గజ పరిశ్రమలు, ప్రముఖ విద్యాసంస్థల భాగస్వామ్యంతో "ఏరోస్పేస్, డిఫెన్స్ ఎకోసిస్టమ్"ను రాష్ట్రంలో అభివృద్ధి చేసేందుకు కాంప్రెహెన్సివ్ రోడ్డు మ్యాప్ ను రూపొందిస్తున్నామన్నారు. 'ఎండ్ టూ ఎండ్ ఎకోసిస్టం' కోసం గత కాంగ్రెస్ ప్రభుత్వాలు వేసిన పునాదులే ప్రస్తుతం తెలంగాణను దేశ స్ట్రాటెజిక్ డిఫెన్స్ హబ్ గా మార్చాయని వివరించారు. కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్ మెంట్, ఐఎస్ బీ, ముంజాల్ ఇన్సిట్యూట్ ఫర్ గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ సంయుక్తాధ్వర్యంలో శనివారం గచ్చిబౌలి లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్ బీ)లో నిర్వహించిన 'ఎంపవరింగ్ ఆత్మనిర్భర్ భారత్: ఇండియాస్ ఏరోస్పేస్ %డ% డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ సమ్మిట్'కు ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా ఏఅండ్ డీ రంగంలో నమోదవుతున్న వేగవంతమైన వృద్ధిని మనకు అనుకూలంగా మార్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. ఇటీవలి కాలంలో అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న పరిణామాల వల్ల గ్లోబల్ సప్లై చెయిన్ ఒత్తిడికి గురవుతుందని, ఈ తరుణంలో విశ్వసనీయమైన సరఫరాదారుల కోసం ప్రపంచం ముఖ్యంగా 'భారత్' లాంటి దేశాలవైపు చూస్తోందన్నారు. గతేడాది దేశ రక్షణ రంగ ఉత్పత్తుల విలువ రికార్డు స్థాయిలో రూ.1.5 లక్షల కోట్ల మార్కును దాటిందన్నారు. రక్షణ రంగ ఎగుమతుల్లో 12 శాతం వృద్ధి రేటు నమోదు కావడం ఈ రంగ పురోగతికి నిదర్శనమన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్య సాధనలో 'ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్' రంగం కీలక పాత్ర పోషించేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 25కు పైగా 'ఏఅండ్ డీ' అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ సంస్థలు, సుమారు 1500కు పైగా ఎంఎస్ఎంఈలు 'తెలంగాణ బ్రాండ్' ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ఏరోస్పేస్ ఎగుమతుల విలువ 2023-24లో రూ.15,900 కోట్లు కాగా 2024-25లో కేవలం మొదటి తొమ్మిది నెలల్లోనే రూ.30,742 కోట్లకు పెరగడం రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిలువెత్తు సాక్ష్యమన్నారు. ఆదిభట్లలో రూ.425 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన 'టాటా%-%సాఫ్రాన్' ఫెసిలిటీ ఇటీవల అందుబాటులోకి వచ్చిందన్నారు. త్వరలోనే రూ.800 కోట్లతో జేఎస్ డబ్ల్యు డిఫెన్స్ 'యూఏవీ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్', రూ.500 కోట్లతో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ డిఫెన్స్ ఫెసిలిటీ కూడా వస్తాయన్నారు. ఈ తరహాలోనే పెట్టుబడులు పెట్టేందుకు మరికొన్ని దిగ్గజ సంస్థలు కూడా ఆసక్తి చూపిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో హీరో ఎంటర్ ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ కాంత్ ముంజాల్, ఐఎస్ బీ డీన్ ప్రొఫెసర్ పి.మదన్, ప్రొఫెసర్ చందన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# దొంగ సొమ్ముతో లిక్కర్ దందాలు

**కవిత స్కాం వల్లే దెబ్బతిన్న బీఆర్ఎస్.. నిప్పులు చెరిగిన మెదక్ బీఆర్ఎస్ నాయకులు**

మెదక్, నవంబర్ 15 (ఈవార్తలు): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై మెదక్ జిల్లా బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కవిత లిక్కర్ స్కాంకు పాల్పడటం వల్ల బీఆర్ఎస్‌కు తీవ్ర నష్టం వాటిల్లిందని వారు ఆరోపించారు. ఈ మేరకు వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ, మెదక్ మున్సిపల్ మాజీ ఛైర్మన్ మల్లికార్జున్ గౌడ్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం తర్వాత కవిత చేసిన ట్వీట్ చూసి ఆశ్చర్యం వేసిందని అన్నారు. ఈ ఫలితాల అనంతరం రాష్ట్రంలో ఇద్దరు వ్యక్తులు మాత్రమే సంతోషంగా ఉన్నట్లు కనిపిస్తోందని, అందులో ఒకరు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాగా మరొకరు కవిత అని ఆయన అన్నారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా కవిత వ్యాఖ్యలు ఉన్నాయని ఆయన విమర్శించారు. పదవులు ఇచ్చిన కన్నతల్లి వంటి పార్టీ మీద, కన్న తండ్రిపై విమర్శలు చేయడం సబబు కాదని ఆయన అన్నారు. ఆమె మాటలు దిగజారుడుతనానికి నిదర్శనమని ఆయన అభివర్ణించారు. కవితతో ఎవరు మాట్లాడిస్తున్నారో తెలియాలని ఆయన అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలపై కవిత చేసిన ట్వీట్ సరికాదని ఆయన స్పష్టం చేశారు. కవిత చేసిన అవినీతి, అడ్డమైన దందాల వల్ల బీఆర్ఎస్ ఓడిపోయిందని ఆయన అన్నారు. ఆమె బంగారం దుకాణాలలోకి వెళ్లి కూడా బ్లాక్ మెయిల్ చేశారని ఆయన ఆరోపించారు. 2019లో తెలంగాణ వ్యాప్తంగా బీఆర్ఎస్ దాదాపు 100 స్థానాలు గెలిస్తే, నిజామాబాద్ పార్లమెంటులో మాత్రం ఆమె ఓడిపోయారని ఆయన గుర్తు చేశారు. కేటీఆర్, హరీశ్ రావును విమర్శించేందుకు మెదక్ జిల్లాకు రావాలా అని ఆయన ప్రశ్నించారు. అక్రమ దందాలు, లిక్కర్ దందాలు చేసి బీఆర్ఎస్ పార్టీని కవిత భ్రష్టు పట్టించారని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోవడానికి కవితనే కారణమని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి మెప్పు కోసం కవిత ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. అసలు కవిత ఎవరిపై పోరాటం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ అసమర్థతను, తప్పిదాలను ఎత్తి చూపాల్సింది పోయి బతిమాలుతున్నట్లుగా మాట్లాడటం ఏమిటని ఆయన నిలదీశారు.



# అండగా ఉంటాం

**మాగంటి కుటుంబానికి కేటీఆర్ భరోసా**

హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ఓటమికి అధైర్యపడొద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన మాగంటి సునీత గోపీనాథ్ నివాసానికి ఆయన వెళ్లారు. ఈ సందర్భంగా సునీతతో పాటు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీ అనేక దౌర్జన్యాలకు, అక్రమాలకు పాల్పడిందని కేటీఆర్ ఆరోపించారు. అయినప్పటికీ, వాటన్నింటినీ ఎదుర్కొని సునీత, ఆమె పిల్లలు ఎంతో స్ఫూర్తితో పోరాడారని అభినందించారు. ఎన్నికల్లో గట్టి పోటీ ఇచ్చి, గొప్ప పోరాట పటిమను ప్రదర్శించారని కొనియాడారు. ఈ క్లిష్ట సమయంలో పార్టీ సునీత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. రాజకీయ భవిష్యత్తుపై ఎలాంటి ఆందోళన చెందవద్దని, పార్టీ అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన భరోసా ఇచ్చారు.

## చింత చచ్చినా పులుపు చావలేదు

**అలాగే ఉంది.. కేటీఆర్ తీరు.. విప్ ఆది శ్రీనివాస్ మండిపాటు**

హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): "కర్మ ఈజ్ బ్యాక్" అని స్వయానా మీ చెల్లెలు చెబుతున్నారని, మీ బతుకు, మీ పార్టీ బతుకు గురించి కనీసం ఆమె చెబుతుంటే అయినా తెలుసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చింత చచ్చినా పులుపు తగ్గనట్లుగా కేటీఆర్ పరిస్థితి ఉందని అన్నారు. జూబ్లీహిల్స్‌లో ఓడిపోయినప్పటికీ ఆయనలో అహంకారం తగ్గలేదని విమర్శించారు. ప్రజలు ఛీకొట్టి 12 గంటలు కాకముందే మీడియా ముందుకు వచ్చి తన బలుపును చూపిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ గుర్తును గాడిదపై ఎక్కించి ఊరేగించామా అంటూ అహంకారపు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. జూబ్లీహిల్స్ ఓటర్ల ముందు కేటీఆర్, బీఆర్ఎస్ గిమ్మిక్కులు చిత్తయ్యాయని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం, ఫేక్ సర్వేలతో మైండ్ గేమ్ ప్లే చేసినా ప్రజలు గుణపాఠం చెప్పారని అన్నారు. ఒక్క ఎన్నికలో కాంగ్రెస్ గెలిచిందని కేటీఆర్ అంటున్నారని, కానీ అసెంబ్లీ ఎన్నికలు మొదలు ఆ తర్వాత లోక్ సభ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్‌ను చిత్తు చేశామని అన్నారు.

## అందెశ్రీకి వారణాసి టీం నివాళి

హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): వారణాసి సినిమా ఈవెంట్‌లో తెలంగాణ రాష్ట్ర గీతం రచయిత అందెశ్రీకి ఘనమైన నివాళి అర్పించారు. ఈవెంట్ లో గ్లింప్స్ కోసం ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్ పై అందెశ్రీ ఫోటోలను వేస్తూ బ్యాగ్రౌండ్ లో జయజయహే తెలంగాణ గీతాన్ని పాడారు. ఈ క్రమంలో రాజమౌళి, మహేశ్ బాబు సహా హాజరైన నటీనటులు, ఇతరులు నిలబడి అందెశ్రీకి నివాళి అర్పించారు. ఇదిలా ఉంటే జయజయహే గీతానికి కీరవాణి స్వరాలు సమకూర్చారు. అంతే కాకుండా వారణాసి సినిమాకు సైతం ఆయనే సంగీత దర్శకుడిగా పనిచేస్తున్నారు. ఇక తెలంగాణ రాష్ట్రగీతం కోసం సైతం అందెశ్రీ కీరవాణి కలిసి పనిచేశారు. దీంతో వీరిద్దరి మధ్య మంచి అనుబంధం ఏర్పడింది.

## రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు కమిట్‌మెంట్

**టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**

హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): 42శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీకి కమిట్‌మెంట్ ఉందని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలతో భేటీ అనంతరం మహేశ్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. 42శాతం రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న కమిట్‌మెంట్ ఏ పార్టీకి లేదన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్ల కోసం ఎన్నో ప్రయత్నాలు చేసిందని చెప్పారు. బీజేపీ ఎన్నో అడ్డంకులు తీసుకువచ్చిందని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ప్రజలు మంచి మెజారిటీతో గెలిపించారని చెప్పారు. నవీన్ యాదవ్‌ను రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ అభినందించారని అన్నారు. యావత్ ప్రజానీకం కాంగ్రెస్ పార్టీతోనే ఉందని జూబ్లీహిల్స్ ప్రజలు సందేశం ఇచ్చారని చెప్పారు. ఇదే ఉత్సాహంతో రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

## ఐబొమ్మ, బప్పం సైట్లు బ్లాక్

హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): సినిమాలు, వెబ్ సిరీస్‌లు పైరసీ చేసే దిగ్గజ ఐబొమ్మ, బప్పం వెబ్‌సైట్‌లను పోలీసులు బ్లాక్ చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ వెబ్ సైట్లు పనిచేయడం లేదని, తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు వాటిని బ్లాక్ చేసి ఉంటారని చర్చ జరుగుతోంది. తెలుగు సినిమాలను పైరసీ చేయడంపై గతంలో తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో సినిమాలు, వెబ్ సిరీస్‌లు పైరసీ చేసే ఐ బొమ్మ, బప్పమ్ వెబ్‌సైట్‌లను పోలీసులు బ్లాక్ చేసినట్లు సమాచారం.

# అవినీతికి కేరాఫ్‌గా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు

**ఏసీబీ సోదాల్లో భారీ అవకతవకలు బట్టబయలు**

**అకౌంటింగ్‌లో లేని నగదు, నిల్వ పత్రాలు బహిర్గతం**

**అధికారుల ఇళ్లలోనూ దాడులు**




హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొనసాగుతున్న అవకతవకలను అరికట్టేందుకు అవినీతి నిరోధక శాఖ పెద్ద ఎత్తున ఆకస్మిక దాడులు నిర్వహించింది. నవంబర్ 14న మొత్తం 23 బృందాలు గండిపేట్, సేరిలింగంపల్లి, మెద్చల్, నిజామాబాద్ టౌన్, జహీరాబాద్, మిర్యాలగూడ, వనపర్తి, మంచిర్యాల, పెదపల్లి, భూపాలపల్లి, వైరా వంటి పలు ప్రాంతాల్లోని ఎస్ఆర్‌వో కార్యాలయాలను ఒకేసారి తనిఖీ చేశాయి. ఈ తనిఖీల్లో భారీగా అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. అకౌంటింగ్‌లో నమోదు చేయని రూ.2,51,990 నగదు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అదనంగా, కార్యాలయాలలో 289 నమోదిత పత్రాలు సంబంధిత దరఖాస్తుదారులకు ఇవ్వకుండా నిల్వ ఉంచినట్లు ఏసీబీ గుర్తించింది. అనుమతి లేకుండా 19 ప్రైవేట్ వ్యక్తులు, 60 డాక్యుమెంట్ రైటర్లు కార్యాలయాల్లో తిరుగుతున్నట్లు బయటపడింది. పలు చోట్ల సీసీటీవీ కెమెరాలు పనిచేయకపోవడం కూడా ముఖ్యమైన లోపంగా అధికారులు గుర్తించారు. ఈ అంశాలను తీవ్రంగా పరిగణించిన ఏసీబీ, సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపించింది. ఇదే సమయంలో, 13 మంది సబ్ రిజిస్ట్రార్‌ల నివాసాల్లో కూడా ఏసీబీ దాడులు చేసి, పెద్ద మొత్తంలో నగదు, బంగారం, ఆస్తిపత్రాలను స్వాధీనం చేసుకుంది. స్వాధీనం చేసిన పత్రాలు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

## సజ్జనార్ దోస్తుకు 20 వేలు టోకరా

**సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త: హైదరాబాద్ సీపీ**

హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): సైబర్ నేరగాళ్లు సామాన్యులనే కాదు, ఉన్నతాధికారులను సైతం వదలడం లేదు. తాజాగా సీనియర్ ఐపీఎస్ అధికారి, హైదరాబాద్ సీపీ సజ్జనార్ పేరుతో సైబర్ కేటుగాళ్లు మోసాలకు పాల్పడ్డారు. ఆయన పేరుతో ఓ నకిలీ ఫేస్‌బుక్ ఖాతా సృష్టించి, ఆయన స్నేహితుడి నుంచి రూ.20,000 కాజేశారు. ఈ విషయాన్ని సజ్జనార్ స్వయంగా 'ఎక్స్' వేదికగా వెల్లడించి ప్రజలను అప్రమత్తం చేశారు. తన పేరుతో ఫేక్ ఫేస్‌బుక్ ఖాతా సృష్టించిన మోసగాళ్లు, అందులో నుంచి తన స్నేహితులకు సందేశాలు పంపారని సజ్జనార్ తెలిపారు. తాను ఆపదలో ఉన్నానని, అత్యవసరంగా డబ్బు కావాలని కోరగా.. అది నిజమేనని నమ్మిన ఓ స్నేహితుడు రూ.20,000 వారి ఖాతాకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. తన అధికారిక ఖాతా మినహా మిగిలినవన్నీ నకిలీవేనని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు ఆయన పలు కీలక సూచనలు చేశారు. తన పేరుతో గానీ, ఇతర ప్రముఖుల పేర్లతో గానీ ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు వస్తే స్పందించవద్దని కోరారు. డబ్బులు పంపాలని వచ్చే సందేశాలను అసలు నమ్మవద్దని, ఒకవేళ అలాంటివి వస్తే ముందుగా సంబంధిత వ్యక్తికి ఫోన్ చేసి నిర్ధారించుకోవాలని సూచించారు. అనుమానాస్పద లింకులు, మెసేజ్‌లు వస్తే వెంటనే బ్లాక్ చేసి, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. మెటా సహకారంతో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఈ నకిలీ ఖాతాలను తొలగించే పనిలో ఉన్నారని ఆయన వివరించారు.

## నేటి నుంచి మేడారంకు ప్రత్యేక బస్సులు




హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): మేడారం మహజతర నేపథ్యంలో ముందస్తు మొక్కులు చెల్లించుకున్న భక్తుల కోసం ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. ఈనెల 16 నుంచి హనుమకొండ నుంచి మేడారానికి ప్రత్యేక బస్సులను నడిపించేలా ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. హనుమకొండ బస్టాండ్ నుంచి ప్రతిరోజు ఉదయం 6.10, 7.00, 8.00, 9.00, మధ్యాహ్నం 12.10, 1.00, 1.40, 14.30బీ రాత్రి8.30గంటలకు మేడారానికి బస్సులు బయలుదేరనున్నాయి. ఇక మేడారం నుంచి ఉదయం 5.45, 9.45, 10.15, 11.15, మధ్యాహ్నం 1.10, సాయంత్రం 4.00, 5.00, 5.30, 6.00 గంటలకు బస్సులను హన్మకొండకు నడిపేలా ఏర్పాట్లను చేశారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే సౌకర్యం ఉంది. పల్లెవెలుగు బస్సు ఛార్జీలు పెద్దలకు రూ.130, పిల్లలకు రూ.80గా ఖరారు చేశారు. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో పెద్దలకు రూ.180, పిల్లలకు రూ. 110గా ఛార్జీలను వసూలు చేయనున్నారు.

## హైకోర్టు వెబ్‌సైట్ హ్యాక్

హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): తెలంగాణ హైకోర్టు వెబ్‌సైట్ హ్యాకింగ్ కలకలం సృష్టించింది. హైకోర్టు వెబ్‌సైట్‌లో ఆర్డర్ కాపీలు డౌన్‌లోడ్ చేస్తున్న సమయంలో అకస్మాత్తుగా సైట్‌లో అంతరాయం ఏర్పాడింది. హైకోర్టు సైట్‌లో ఏకంగా బెట్టింగ్ సైట్ ప్రత్యక్షమైంది. వెంటనే హైకోర్టు రిజిస్ట్రార్ సిబ్బంది ఈ విషయం పోలీసులకు తెలియజేశారు. సైబర్ అభియోగాల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హ్యాకర్లు ఎలా యాక్సెస్ చేశారు? సర్వర్‌లో ఏదైనా లోపాలున్నాయా? అన్న కోణంలో విచారణ జరుగుతోంది. ఈ ఘటనతో కొద్దిసేపు హైకోర్టు వెబ్‌సైట్ సేవలు అంతరాయం చెందగా, అవాంతరాలు ఎదురయ్యాయి.



# నేటి బాలలే.. రేపటి సమాజ సేవకులు

**భాష్యం పాఠశాల బాలల దినోత్సవంలో మార్కండేయులు**

ఏఎస్ రావు నగర్, నవంబర్ 15 (ఈవార్తలు): ఏఎస్ రావు నగర్ లోని భాష్యం పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్ఈఓ మార్కండేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి సమాజ సేవకులు అన్నారు. పిల్లలు దేవుడిచ్చిన వరమని వారిని జాగ్రత్తగా చూసుకోవలసిన అవసరం ఉందన్నారు. భాష్యం విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో సెంట్రల్ లెవెల్ స్పోర్ట్స్ నిర్వహిస్తున్నామన్నారు. భారతదేశ మొదటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ పిల్లలంటే ఎంతో ప్రేమ, ఆప్యాయత చూపేవారని, అందుకే ఆయన జన్మదినాన్ని బాలల దినోత్సవం గా జరుపుకుంటామన్నారు. సీఈవో చైతన్య మాట్లాడుతూ భవిష్యత్తుకు బాల్య దశ ఎంతో కీలకమైంది అన్నారు. ప్రధానోపాధ్యాయుడు అమరేశ్వరరావు, ప్రధానోపాధ్యాయురాలు వనిత బాలల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా పిల్లల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. విద్యార్థులకు వివిధ రకాల క్రీడల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.




## దేశంలోనే తొలి కన్స్యూమర్ ఏఐ కో పైలెట్ డిజైన్

వైజాగ్, నవంబర్ 15 (ఈవార్తలు):



భారతదేశ వినియోగదారుల సమస్యలను ఒక్క క్లిక్‌తో పరిష్కరించే విప్లవాత్మకమైన డిజిటల్ సాధనంగా నిలుస్తూ, తొలి ఏఐ కన్స్యూమర్ కో పైలెట్‌ను ఏపీకి చెందిన యువ టెక్ ఇన్నోవేటర్ మహ్మద్ బాజీ అభివృద్ధి చేశారు. ప్రతిరోజూ కోట్లాది మంది ఎదుర్కొనే బ్యాంకింగ్ ఫీజులు, ఈ కామర్స్ రిఫండ్లు, టెలికాం బిల్లింగ్, ఇన్సురెన్స్ తిరస్కరణలు, రియల్ ఎస్టేట్ సమస్యలు వంటి క్లిష్ట ప్రశ్నలకు ఈ ఏఐ కొన్ని సెకన్లలో స్పష్టమైన న్యాయ సలహాను అందిస్తుంది. కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ 2019, 1915 హెల్ప్ లైన్, ఈ జాగృతి, జిల్లా, రాష్ట్ర, జాతీయ కమిషన్ల జ్యూరిడిక్షన్ వంటి కీలక సమాచారాన్ని తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ఈ కో–పైలెట్ అందిస్తుందని బాజీ తెలిపారు. ప్రతి పౌరుడిని తన హక్కులు గురించి శక్తి వంతం చేయడమే తమ లక్ష్యమని న్యాయవాది అయిన బాజీ తెలిపారు. ఇది ప్రతి ఇంటికీ డిజిటల్ న్యాయ సలహాదారుగా పని చేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ డిజిటల్ సేవల డిజిటలైజేషన్‌లో వినియోగదారులకు నిజమైన రక్షణగా నిలిచేందుకు అవకాశం ఉందని, దీన్ని వినియోగదారులకు అందించేలా స్టార్టప్ తరహాలో అందించేందుకు ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకోబోతున్నట్లు తెలిపారు.

# హిందూపురంలో ... బాలకృష్ణ అనుచరుల విధ్వంసం

**ఇది ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి.. పోలీసుల నిర్లక్ష్యం.. వైసీపీ కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండించిన జగన్**

తాడేపల్లి, నవంబర్ 15 (ఈవార్తలు): హిందూపురంలోని వైసీపీ కార్యాలయంపై జరిగిన దాడిని ఆ పార్టీ అధినేత జగన్ తీవ్రంగా ఖండించారు. ఇది కేవలం తమ పార్టీ కార్యాలయంపై జరిగిన దాడి కాదని, ప్రజాస్వామ్యంపైనే జరిగిన ఒక క్రూరమైన దాడి అని ఆయన అభివర్ణించారు. టీడీపీ నేతలు, బాలకృష్ణ అనుచరులు సాగించిన ఈ దౌర్జన్యం అత్యంత హేయమైన, ఆటవిక చర్య అని మండిపడ్డారు. రాజకీయ పార్టీలే కార్యాలయాలను ధ్వంసం చేయడం, ఫర్నిచర్‌ను పగలగొట్టడం, కార్యకర్తలపై భౌతిక దాడులకు పాల్పడటం వంటివి ప్రజాస్వామ్య విలువలు ప్రమాదకర స్థాయిలో పతనమయ్యాయనడానికి నిదర్శనమని జగన్ ట్వీట్ చేశారు. ఈ దాడి సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత ఆందోళనకరమని జగన్ విమర్శించారు. వారి నిశ్శబ్దం కేవలం నిర్లక్ష్యం కాదని, అది ఒక హెచ్చరిక అని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతల వ్యవస్థను



ముఖ్యమంత్రి చంద్రబాబు తన రాజకీయ ప్రయోజనాల కోసం, రాజకీయ అజెండా కోసం బహిరంగంగా దుర్వినియోగం చేస్తున్నారనడానికి ఈ ఘటనే నిలువెత్తు సాక్ష్యమని ఆరోపించారు. పోలీసుల ప్రేక్షకపాత్ర వెనుక ప్రభుత్వ పెద్దల అండదండలు స్పష్టంగా కనిపిస్తున్నాయని విమర్శించారు. హిందూపురంలో టీడీపీ ప్రదర్శించిన ఈ క్రూరత్వం, చంద్రబాబు నాయకత్వం ఏ విధంగా గుంపులను రెచ్చగొడుతుందో, హింసను ఎలా ప్రోత్సహిస్తుందో స్పష్టం చేస్తోందని జగన్ పేర్కొన్నారు. భయం, దౌర్జన్యాలతో రాజకీయ ప్రత్యర్థులను అణచివేయాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. ఒక ప్రభుత్వం తన ప్రత్యర్థుల ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కులను కూడా కాపాడలేనప్పుడు, ఇక పాలన గురించి మాట్లాడే నైతిక హక్కును పూర్తిగా కోల్పోయినట్టేనని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఈ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇది కేవలం వైసీపీ కార్యాలయంపై జరిగిన దాడి కాదని, ప్రజాస్వామ్యాన్ని, రాజకీయ స్వేచ్ఛను విశ్వసించే ప్రతి పౌరుడిపై జరిగిన దాడిగా భావిస్తున్నామని జగన్ తన ప్రకటనలో స్పష్టం చేశారు.




## దేశం మెచ్చేలా వారణాసి

**గ్లోబ్‌ట్రాటర్ ఈవెంట్‌లో మహేశ్ బాబు**

హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): 'నాన్నగారు(కృష్ణ) ఎప్పుడూ నన్ను ఒక మాట అడుగుతూ ఉండేవారు. నువ్వు పౌరాణిక పాత్ర చేస్తే చూడాలని ఉంది అని చాలా సార్లు అడిగారు. ఈ విషయంలో నేను ఆయన మాట వినలేదు. ఇన్నాళ్లకు వారణాసిలో అలాంటి పాత్ర చేశా. ఆయన ఎక్కడ ఉన్నా ఆశిస్సులు మనతో ఉంటాయి' అన్నారు సూపర్ స్టార్ మహేశ్ బాబు. రాజమౌళి దర్శకత్వంలో ఆయన హీరోగా నటిస్తున్న చిత్రం 'వారణాసి'. ఈ యాక్షన్ అడ్వెంచర్ మూవీలో ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటించగా, పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్ పాత్ర పోషించాడు. గ్లోబ్ ట్రాటర్ పేరుతో హైదరాబాద్‌లో నిర్వహించిన ఈవెంట్‌లో శనివారం ఈ మూవీ టైటిల్‌తో పాటు స్పెషల్ వీడియోని రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా మహేశ్ బాబు మాట్లాడుతూ..'వారణాసి నా డ్రీమ్ ప్రాజెక్ట్. జీవితంలో ఒక్కసారి మాత్రం ఇలాంటి సినిమా చేసే అవకాశం వస్తుంది. దీని కోసం ఎంత కష్టపడాలో అంత కష్టపడతా. అందరూ గర్వపడేలా చేస్తా. ముఖ్యంగా రాజమౌళి గర్వపడేలా శ్రమిస్తా. ఈ మూవీ విడుదలైన తర్వాత యావత్ దేశం మనల్ని చూసి గర్వపడుతుంది. ఈ ఈవెంట్ కేవలం టైటిల్ ప్రకటన కోసమే. ముమ్మందు ఎలా ఉంటుందో మీ ఊహకే వదిలేస్తున్నా. మీ(ఫ్యాన్స్) సపోర్ట్ ఎప్పుడూ ఇలానే ఉండాలని కోరుకుంటున్నా. మీరు చూపించే అభిమానానికి థ్యాంక్స్ అనే మాట చాలా చిన్నది. ఈ ఈవెంట్ ఇంత సజావుగా జరిగేలా సహకరించిన పోలీసులకు ధన్యవాదాలు' అని అన్నారు. ఎంఎం కీరవాణి దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2027 వేసవిలో ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.



## గంజాయి నిర్మూలనపై అవగాహన

గంజాయి నిర్మూలనపై జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని నాయకపుగూడెంలో సాంస్కృతిక సారథి కళాకారులు కళా ప్రదర్శన నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, గంజాయి నిర్మూలన, ఆర్థిక అభివృద్ధి తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థాయి అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

- సారంగపూర్, నవంబర్ 15 (ఈవార్తలు)



## 48 గంటల్లో రైతులకు చెల్లింపులు జరగాలి

**జగిత్యాల అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత ఆదేశాలు**

**మల్యాల మండలంలోని కొనుగోలు కేంద్రాల పరిశీలన**

మల్యాల, నవంబర్ 15 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు, ముత్యంపేట గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత శనివారం పరిశీలించారు. రైతుల నుంచి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వల గురించి కేంద్రాల నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలలో నాణ్యత ప్రమాణాలను పరీక్షించి నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని అదేరోజు రైస్ మిల్లులకు తరలించాలని, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని, రైతులకు 48 గంటల లోగా చెల్లింపులు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన వసతులు కల్పించాలని అన్నారు. సన్న రకం ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైస్ మిల్లుల వద్ద ఎటువంటి జాప్యం లేకుండా దిగుమతి అయ్యేలా చూడాలని అన్నారు. హమాలీల సమస్య లేకుండా జాగ్రత వహించాలని అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ వెంట డి ఏం సివిల్ సప్లై జితేంద్ర ప్రసాద్, (తహసీల్దార్) వసంత, రెవెన్యూ ఇన్స్పెక్టర్ తిరుపతి తదితరులు ఉన్నారు.




# కూటమి సర్కారులో ఏపీ అధోగతి

**వైసీపీ అధికార ప్రతినిధి శ్యామల**

తాడేపల్లి, నవంబర్ 15 (ఈవార్తలు): కూటమి ప్రభుత్వంపై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యాంకర్ శ్యామల తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గతంలో తమ అధినేత జగన్మోహన్ రెడ్డి విశాఖను బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్‌తో పోటీపడే నగరంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నారని గుర్తుచేశారు. కానీ కూటమి నేతలు అధోగతి పాలుచేస్తున్నారని వ్యాఖ్యానించారు. "బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ తో పోటీపడే విధంగా విశాఖ నగరాన్ని అభివృద్ధి చేస్తానని జగన్ గారు చెప్పారు. పిల్లలకు మనం ఇచ్చే నిజమైన ఆస్తి విద్య మాత్రమే... అని భావించి, విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. విద్య , వైద్యం పేద మధ్యతరగతి ప్రజలకు అందించడమే లక్ష్యంగా పనిచేశారు. కట్ చేస్తే.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఒకవైపు కల్తీ మద్యాన్ని విస్తరించి, విద్య, వైద్యాన్ని పేద మధ్యతరగతి ప్రజలకు దూరం చేశారు. దీనికి తోడుగా విశాఖ బీచ్ లో భార్యాభర్తలు రెండు పెగ్గులు వేసుకునే సౌకర్యాన్ని కల్పించి , గోవాతో పోటీ పడే విధంగా విశాఖ బీచ్ ఉండాలని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు అంటున్నారు! రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది ఎవరు? అధోగతి పాలు చేస్తున్నది ఎవరు? మీరే గమనించండి!" అంటూ శ్యామల సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

## చిన్న కమ్మ కల్యాణ్ కనిపించలేదేం

**మాజీమంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా**

తాడేపల్లి, నవంబర్ 15 (ఈవార్తలు): ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మరోసారి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. విశాఖపట్నంలో జరిగిన సీఐఐ (భారత పరిశ్రమల సమాఖ్య) భాగస్వామ్య సదస్సును ప్రస్తావిస్తూ ఆయనపై సోషల్ మీడియా వేదికగా సెటైర్లు వేశారు. తన అధికారిక ఎక్స్ ఖాతాలో అంబటి రాంబాబు నేడు ఓ పోస్ట్ పెట్టారు. "విశాఖపట్నంలో ఆర్భాటంగా జరిగిన సీఐఐ సమ్మిట్‌లో మన చిన్న కమ్మ కల్యాణ్ గారు కనిపించలేదేంటబ్బా! అని ఆయన ప్రశ్నించారు. ఈ ట్వీట్‌కు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌తో పాటు పవన్ కల్యాణ్‌ను కూడా ఆయన ట్యాగ్ చేశారు.

## విశాఖ గోమాంసంపై పవన్ సీరియస్

**ఎవరైనా వదలవద్దని పోలీసులకు ఆదేశాలు**

వైజాగ్, నవంబర్ 15 (ఈవార్తలు): విశాఖలో భారీగా గోమాంసం నిల్వలు లభ్యమైన ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీరియస్ అయ్యారు. ఇటీవల మిత్రా కోల్డ్ స్టోరేజీలో1.89 లక్షల కేజీల గోమాంసం పట్టుబడింది. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన ఆయన.. విశాఖ సీపీకి ఫోన్ చేసి కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీనివెనుక ఉన్నదెవరైనా సరే.. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. గోమాంసం నిల్వల వెనుక ఉన్న అసలు మూలాలను గుర్తించి కఠినంగా శిక్షించేలా చర్యలు చేపట్టాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఇప్పటికే కోల్డ్ స్టోరేజీ నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నామని సీపీ వివరించారు. అక్రమ గోవధ, గోమాంసం సరఫరా, ఎగుమతులను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పిఠాపురంలో అక్రమంగా నిర్వహిస్తోన్న జంతు వధశాల గురించి తన దృష్టికి వచ్చిన వెంటనే మూసివేయించామని గుర్తుచేశారు.

## మదనపల్లె కిడ్నీ రాకెట్ కేసులో ఆరుగురు అరెస్టు

మదనపల్లె, నవంబర్ 15 (ఈవార్తలు): ఏపీలో సంచలనం రేపిన మదనపల్లె కిడ్నీ రాకెట్ కేసులో పోలీసులు ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారిని శనివారం సాయంత్రం మదనపల్లె డీఎస్పీ మహేంద్ర.. మీడియా ముందు ప్రవేశపెట్టారు. గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కిడ్నీ రాకెట్ కేసులో ఇప్పటికి ఆరుగురిని అరెస్ట్ చేశామని, మరో 8 మంది నిందితులు పరారీలో ఉన్నారని తెలిపారు. వారిని పట్టుకునేందుకు నాలుగు బృందాలను ఏర్పాటు చేశామని.. గోవా, కర్ణాటక, తెలంగాణలో తనిఖీలు చేస్తున్నామని వివరించారు. నవంబర్ 9వ తేదీన గ్లోబల్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ లో బెంగళూరుకు చెందిన డాక్టర్, ఆయన టీమ్ కలిసి చట్ట వ్యతిరేకంగా వైజాగ్ కు చెందిన ఇద్దరు మహిళలకు కిడ్నీ మార్పిడి చికిత్స నిర్వహించగా.. యమున అనే మహిళ మరణించిందని స్పష్టం చేశారు. ఆమె తల్లి సూరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మదనపల్లె పోలీసులు.. డాక్టర్ కంప ఆంజనేయులు, బాలరంగడు, మెహరాజ్, పిల్లి, పద్మ, సత్య, సూరిబాబులను అరెస్ట్ చేసి, వారి నుంచి ఆరు మొబైల్స్ ను స్వాధీనం చేసుకున్నారు. కిడ్నీ రాకెట్లో ఎంతమంది హస్తం ఉంది? ఇప్పటి వరకూ ఎన్ని కిడ్నీ మార్పిడులు చేశారు? అన్న కోణంలో పోలీసుల విచారణ కొనసాగుతున్నట్లు డీఎస్పీ మహేంద్ర తెలిపారు.

## పిఠాపురం జనసేన ఇంచార్జి తొలగింపు

పిఠాపురం, నవంబర్ 15 (ఈవార్తలు): కాకినాడ జిల్లా పిఠాపురం జనసేనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. పిఠాపురంలో గతకొంతకాలంగా వర్గవిభేదాలు తలెత్తుతున్నాయి. దీంతో అధిష్టానం వద్దకు ఫిర్యాదులు వెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీని ప్రక్షాళన చేయాలని పవన్ కల్యాణ్ నిర్ణయించారు. ఈ మేరకు ఫైవ్ మెన్ కమిటీ నుంచి మర్రెడ్డి శ్రీనివాస్‌ను తొలగించారు. గతంలో పార్టీ ఇంఛార్జ్‌గా ఆయన పని చేశారు. 2 నెలల క్రితం ఇంఛార్జ్ స్థానంలో పార్టీ కార్యక్రమాల నిర్వహణకు ఐదుగురితో కమిటీ వేశారు. మర్రెడ్డిపై వస్తున్న ఫిర్యాదులతో కమిటీ నుంచి కూడా తొలగింపు నిర్ణయం వచ్చింది. దీంతో మర్రెడ్డి స్థానంలో ఓదూరి కిషోర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు అధికారికంగా ప్రకటన విడుదల చేశారు.



## సబ్ స్టేషన్‌లోనే మద్యం పార్టీలు

**జగిత్యాలలో అసిస్టెంట్ లైన్‌మెన్ల నిర్వాకం**

జగిత్యాల టౌన్, నవంబర్ 15 (ఈవార్తలు): సబ్ స్టేషన్‌నే బార్‌గా మార్చేశారు విద్యుత్తు అధికారులు. ఇదేంటని అడిగితే రీఫ్రెష్ అవుతున్నామని హల్చల్ చేశారు. ఈ ఘటన జగిత్యాలలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. అసిస్టెంట్ లైన్‌మెన్లుగా పనిచేస్తున్న ప్రభాకర్, బాలకృష్ణ, రాజశేఖర్.. సబ్ స్టేషన్‌లోనే మందు పార్టీ చేసుకున్నారు. సబ్‌స్టేషన్‌లో ఇదేం పని అని అడిగితే.. రీఫ్రెష్ అవుతున్నామని, తాగితే తప్పేంటని అనడం గమనార్హం. వీరి తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. తాగితే ఇంట్లోనో, బార్లలోనో తాగాలి కానీ, విద్యుత్తు సబ్ స్టేషన్లను మద్యం పార్టీలకు అడ్డాగా మార్చడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరిస్తామని చెప్పామా?

**విశాఖ సీఐఐ సమ్మిట్‌లో చంద్రబాబు**



వైజాగ్, నవంబర్ 15 (ఈవార్తలు): వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై వైఎస్సార్సీపీ పదే పదే చేస్తున్న విమర్శలపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పందించారు. విశాఖలో జరిగిన సీఐఐ సమ్మిట్ వేదికపైనే వైసీపీ విమర్శలకు స్ట్రాంగ్ కౌంటరిచ్చారు. స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరిస్తామని ఎవరు చెప్పారు? ప్రైవేటీకరణ చేయడం లేదు అని మీ ఇంటికి వచ్చి చెప్పాలా? కేంద్రం రూ.12 వేల కోట్లు ఇచ్చింది సంస్థను కాపాడేందుకు కాదా? అని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను లాభాల్లోకి తీసుకురావాలన్నదే తమ ప్రయత్నమని సీఎం స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేస్తారని చేస్తున్న ప్రచారాన్ని ఎవ్వరూ నమ్మొద్దని సూచించారు.



# ముస్లిం మావోయిస్టుల పార్టీ.. కాంగ్రెస్

**కులతత్వ విషాన్ని ప్రజలు తిరస్కరించారు**

**ఓటములపై కాంగ్రెస్ ఆత్మపరిశీల చేసుకోవాలి**

**ప్రధాని నరేంద్ర మోదీ**

న్యూఢిల్లీ: కులతత్వ విషాన్ని చిమ్మేవారిని, ముస్లిం లీగ్-మావోయిస్టు భావజాలం కలిగిన వారిని బీహార్ ప్రజలు తిరస్కరించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సూరత్‌లో స్థిరపడిన బీహారీలు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, దశాబ్దకాలంగా ఓటములపై కాంగ్రెస్ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ముస్లింలీగ్-మావోయిస్టు కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరించారని ఆయన అన్నారు. మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలతో పనిచేసిన కాంగ్రెస్ జాతీయ నాయకులు కూడా రాహుల్ గాంధీ వ్యవహారశైలితో తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ మిత్రపక్షాలు, కార్యకర్తలకు కూడా పరాజయం గురించి వివరించే పరిస్థితి ఆ పార్టీలో లేదని ఆయన విమర్శించారు. ఈవీఎంలు, ఎన్నికల సంఘం, ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను నిందించే సులభ మార్గాన్ని కాంగ్రెస్ పార్టీ ఎంచుకుందని ఆయన అన్నారు. కులతత్వ విషాన్ని చిమ్ముతున్న వారిని ప్రజలు తిరస్కరిస్తారని బీహార్ ఎన్నికలు మరోసారి రుజువు చేశాయని ఆయన అన్నారు. దళితులు అధికంగా ఉండే 38 స్థానాల్లో ఎన్డీయే 34 స్థానాలను గెలుచుకుందని ఆయన తెలిపారు.

# జెన్ జెడ్ ఓటర్లు బహుపరాక్

## ఓటరు జాబితాలో మీ పేర్లు చూసుకోండి

### యువతకు నటుడు విజయ్ కీలక సందేశం



చెన్నై: ఎస్ఐఆర్ అంశంలో ఓటర్ల జాబితాకు సంబంధించి ప్రజలలో గందరగోళం నెలకొందని టీవీకే అధినేత, ప్రముఖ నటుడు విజయ్ అన్నారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఒక వీడియోను విడుదల చేశారు. ప్రజలు, ముఖ్యంగా జెన్-జెడ్ ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఎస్ఐఆర్ తర్వాత నవీకరించబడిన ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో చూసుకోవాలని కోరారు. భారత రాజ్యాంగం ఇచ్చిన అతి ముఖ్యమైన హక్కులలో ఓటు హక్కు ఒకటని విజయ్ పేర్కొన్నారు. ఈ దేశ పౌరుడిగా జీవించేందుకు ఓటు హక్కు చాలా అవసరమని అన్నారు. ఓటు హక్కు లేకపోతే మన ప్రజాస్వామ్యం అసంపూర్ణమే అని ఆయన అభిప్రాయపడ్డారు. ఎస్ఐఆర్ నేపథ్యంలో చాలామంది తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ ప్రచురించే ఓటరు జాబితాలో మన పేర్లు కనిపిస్తేనే ఓటు వేయగలమని గుర్తుంచుకోవాలని సూచించారు. తమిళనాడులో 6.36 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, కానీ ఎస్ఐఆర్ ప్రక్రియను నెలలోపు ఎలా పూర్తి చేయగలుగుతారని ఆయన ప్రశ్నించారు. ఇప్పటి వరకు తమ పార్టీకి చెందిన చాలామందికి ఫారమ్‌లు అందలేదని అన్నారు. అందుకే ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. భౌతిక ఫారమ్ అందుకోలేని వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అప్పుడే ఓటరు జాబితాలో మన పేరు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. యువత ఓట్లను తొలగించడానికి ప్రయత్నాలు జరగవచ్చని ఆయన హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో జెన్ జెడ్ ఓటర్లు నిర్ణయాత్మక పాత్రను పోషిస్తారని, అందుకే వారికి జాబితాలో చోటు లేకుండా ప్రయత్నాలు చేయవచ్చని అన్నారు. ఓటు అనేది అత్యంత శక్తిమంతమైన ప్రజాస్వామ్య సాధనమని గుర్తుంచుకోవాలని ఆయన ఉద్బోధించారు. మన ఓటు మన ప్రజాస్వామ్య ఆయుధమని పేర్కొన్నారు.

# బీహార్ ఫలితాలు నమ్మశక్యంగా లేవు: కేసీ

న్యూఢిల్లీ: బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితం నమ్మశక్యంగా లేదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. బీహార్ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఆయన ఆరోపించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఫలితాలను విశ్లేషించి, సమీక్షిస్తామని తెలిపారు. అనంతరం చట్టపరంగా ముందుకు వెళతామని ఆయన స్పష్టం చేశారు. బీహార్ ఎన్నికల ఫలితాలపై ఇండియా కూటమి కలిసికట్టుగా చర్యలకు ఉపక్రమిస్తుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఈ విషయమై ఇప్పటికే ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్‌ను సంప్రదించినట్లు తెలిపారు. బీహార్‌లో ఓటమి నేపథ్యంలో మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ... ఖర్గే నివాసంలో సమావేశం నిర్వహించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 19 స్థానాలు గెలిచిన కాంగ్రెస్ పార్టీ ఈసారి 6 సీట్లకు పరిమితమైంది. ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలతో కూడిన మహాఘట్‌బంధన్ కేవలం 35 స్థానాలతో సరిపెట్టుకుంది. బీజేపీ-జేడీయూ నేతృత్వంలోని ఎన్డీయే 200కు పైగా స్థానాలు గెలుచుకుంది.

# బీహార్ విజయం చారిత్రాత్మకం

**నితీశ్ కుమార్‌తో భేటీ అనంతరం చిరాగ్ పాశ్వాన్**



పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే అద్భుత విజయం సాధించిన నేపథ్యంలో కూటమిలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్ పాశ్వాన్) అధినేత చిరాగ్ పాశ్వాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిన్న ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ఈ రోజు ఆయన ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌తో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 2020 నాటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను చూసిన తర్వాత తన పని అయిపోయిందని చాలామంది అనుకున్నారని పేర్కొన్నారు. విజయం తనకు ఎంతో విలువైనదని ఆయన అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో తదుపరి చర్యలపై నితీశ్ కుమార్‌తో చర్చించినట్లు వెల్లడించారు. బీహార్‌లో చారిత్రాత్మక విజయం సాధించిన నేపథ్యంలో ఎమ్మెల్యేలతో కలిసి వెళ్లి ముఖ్యమంత్రిని అభినందించామని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు, అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్లు వెల్లడించారు. 005లో తమ పార్టీ ఒంటరిగా పోటీ చేసి 29 స్థానాల్లో విజయం సాధించిందని, ఆ తర్వాత ఇవే తమకు అత్యుత్తమ ఫలితాలు అని అన్నారు. తమ కూటమిలో ఎల్‌జేపీ, జేడీయూ పాత్రపై ఎన్నికల సమయంలో ఎన్నో అసత్య ప్రచారాలు చేశారని గుర్తు చేశారు. అయినప్పటికీ తాము కలిసికట్టుగా ముందుకు సాగామని అన్నారు. 2025లో మాపై నమ్మకం ఉంచి ఎన్డీయే మాకు ఐదు ఎంపీ స్థానాలు కేటాయిస్తే విజయం సాధించామని, ఒక్క ఎమ్మెల్యే లేని మాకు 29 స్థానాలు కేటాయిస్తే 19 గెలుచుకున్నామని అన్నారు. గెలవలేని స్థానాలను తమకు కావాలనే ఇచ్చారని జేడీయూపై విమర్శలు చేశారని, తద్వారా తమ మధ్య విభేధాలు సృష్టించే ప్రయత్నం చేశారని అన్నారు. కానీ ఈ ఫలితాలు ఆ ఆరోపణలను తిప్పికొట్టాయని అన్నారు. ఆర్జేడీ క్రమంగా తన ప్రాబల్యాన్ని కోల్పోతోందని చిరాగ్ పాశ్వాన్ అన్నారు. 90లలో నడిచిన జంగిల్ రాజ్‌ను ప్రజలు మరోసారి తిప్పికొట్టారని అన్నారు.

# 30 తర్వాత ఎం క్యాష్ సేవలు బంద్: ఎస్బీఐ

న్యూఢిల్లీ: దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తమ కస్టమర్లకు ఒక ముఖ్యమైన ప్రకటన జారీ చేసింది. డిజిటల్ చెల్లింపుల విభాగంలో అందిస్తున్న 'ఎం-క్యాష్' సర్వీసును నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. ఈ నెల 30వ తేదీ తర్వాత ఈ సేవలు అందుబాటులో ఉండవని స్పష్టం చేసింది. ఎస్‌బీఐ ఇంటర్నెట్ బ్యాంకింగ్, యోనో లైట్ యాప్‌లలో ప్రస్తుతం ఈ ఎం-క్యాష్ సేవలు అందుబాటులో ఉన్నాయి. దీని ద్వారా కస్టమర్లు లబ్ధిదారుడి (బెనిఫిషియరీ) బ్యాంక్ ఖాతాను ముందుగా నమోదు చేయకుండానే, కేవలం వారి మొబైల్ నంబర్ లేదా ఈ-మెయిల్ ఐడీ ఉపయోగించి డబ్బు పంపడం, స్వీకరించడం చేయవచ్చు. అయితే, ఈ సదుపాయాన్ని ఈ నెల 30 నుంచి తొలగించనున్నట్లు బ్యాంకు తెలిపింది. ఎం-క్యాష్ సేవలు నిలిచిపోనున్న నేపథ్యంలో కస్టమర్లు నగదు బదిలీ కోసం ఇతర సురక్షితమైన డిజిటల్ పద్ధతులను ఉపయోగించుకోవాలని ఎస్‌బీఐ సూచించింది. ప్రత్యామ్నాయ మార్గాలుగా యూపీఐ, ఐఎంపీఎస్, నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ వంటివి అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. ఎం-క్యాష్ మాదిరిగానే యూపీఐ ద్వారా డబ్బు పంపడానికి కూడా లబ్ధిదారుడిని ముందుగా రిజిస్టర్ చేసుకోవాల్సిన అవసరం లేదు. భీమ్ ఎస్‌బీఐ పే, యోనో యాప్‌ల ద్వారా మొబైల్ నంబర్ లేదా ఖాతా వివరాలతో సులభంగా లావాదేవీలు జరపవచ్చు. అలాగే ఐఎంపీఎస్, నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ సేవలు యథావిధిగా పనిచేస్తాయని బ్యాంకు వివరించింది.

# నలుగురు డాక్టర్లపై ఎన్‌ఎంసీ వేటు

న్యూఢిల్లీ: ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలపై జాతీయ మెడికల్ కమిషన్ సంచలన నిర్ణయం తీసుకుంది. నలుగురు డాక్టర్ల రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తూ, దేశంలో ఎక్కడా వైద్య వృత్తి చేపట్టకుండా వారిపై నిషేధం విధించింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. ఢిల్లీ ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు కేసుకు సంబంధించి ఉగ్రవాద మాడ్యూల్‌తో వీరికి సంబంధాలున్నట్లు తేలడంతో ఈ కఠిన చర్యలు తీసుకున్నారు. ఎన్‌ఎంసీ ఆదేశాల ప్రకారం డాక్టర్ ముజాఫర్ అహ్మద్, డాక్టర్ అదీల్ అహ్మద్ రాదర్, డాక్టర్ ముజమ్మిల్ షకీల్, డాక్టర్ షాహీన్ సయీద్‌ల పేర్లను ఇండియన్ మెడికల్ రిజిస్ట్రీ, నేషనల్ మెడికల్ రిజిస్ట్రీ నుంచి తొలగించారు. జమ్మూకశ్మీర్ పోలీసులు అందించిన సమాచారం, ఉగ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టం కింద నమోదైన ఎఫ్ఐఆర్‌లు, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌ఎంసీ వెల్లడించింది. ఎన్‌ఎంసీ ఆదేశాల మేరకు సంబంధిత రాష్ట్రాల మెడికల్ కౌన్సిళ్లు కూడా ఈ నలుగురు డాక్టర్ల పేర్లను తమ రిజిస్టర్ల నుంచి తొలగించాయి. ఇదే కేసుకు సంబంధించి, ప్రధాన నిందితుడైన డాక్టర్ ఉమర్-ఉన్-నబీ అలియాస్ ఉమర్ మహ్మద్‌కు చెందిన ఇంటిని భద్రతా బలగాలు ఇటీవల పుల్వామాలో పేల్చివేసిన విషయం తెలిసిందే. తాజా పరిణామం ఈ కేసులో మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

# ప్రజాసేవ కొనసాగిస్తాం: ఆర్జేడీ

**ఆర్జేడీ ఆటవిక రాజ్యం భయంతోనే ఎన్డీయేకు ఓట్లు: పీకే**

పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) తొలిసారిగా స్పందించింది. ఓటమి పట్ల విచారం, విజయంతో అహంకారం ఉండకూడదని ఆర్జేడీ పేర్కొంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 202 స్థానాలను గెలుచుకోగా, మహాఘట్‌బంధన్ 35 సీట్లకు పరిమితమైంది. ఆర్జేడీ 25 స్థానాలను దక్కించుకుంది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ స్పందిస్తూ, ఒడుదొడుకులు ఎదురైనా ప్రజాసేవ కొనసాగుతూనే ఉంటుందని తెలిపింది. ప్రజాసేవ అనేది నిరంతర ప్రక్రియ అని, అది ఎల్లప్పుడూ కొనసాగుతూనే ఉంటుందని పేర్కొంది. ఈ క్రమంలో ఒడుదొడుకులు సహజమని అభిప్రాయపడింది. ఓటమితో విచారం, విజయంతో అహంకారం తమ దరిచేరదని స్పష్టం చేసింది. ఆర్జేడీ పేదల పార్టీ అని, వారి మధ్య ఉంటూ వారి గొంతుకను వినిపిస్తూనే ఉంటుందని తెలిపింది. ఎన్నికల ఫలితాలపై ప్రశాంత్ కిశోర్‌కు చెందిన జన్ సురాజ్ పార్టీ కూడా స్పందించింది. 238 స్థానాల్లో పోటీ చేసిన ఆ పార్టీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. ఫలితాలపై స్పందిస్తూ, ఆర్జేడీ మళ్లీ అధికారంలోకి వస్తే అటవిక రాజ్యం వస్తుందనే భయంతో తమకు మద్దతుగా నిలవాల్సిన వారిలో చాలామంది ఎన్డీయే వైపు మొగ్గు చూపారని పేర్కొంది. ఎర్రకోట వద్ద పేలుడు అనంతరం

# 40 వేల గ్రాంట్ విటారా కార్లు రీకాల్

**ఫ్యూయల్ లెవెల్ ఇండికేటర్‌లో లోపం**

**డిసెంబర్ 2024 నుంచి ఏప్రిల్ 2025 మధ్య తయారైన వాహనాల్లో సమస్య**

న్యూఢిల్లీ: దేశంలోని అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ తన ప్రముఖ మోడల్ గ్రాండ్ విటారాకు సంబంధించి కీలక ప్రకటన చేసింది. ఫ్యూయల్ లెవెల్ ఇండికేటర్‌లో లోపం కారణంగా 39,506 గ్రాండ్ విటారా యూనిట్లను రీకాల్ చేస్తున్నట్లు వెల్లడించింది. 2024 డిసెంబర్ 9 నుంచి 2025 ఏప్రిల్ 29 మధ్య తయారైన వాహనాల్లో ఈ సమస్యను గుర్తించినట్లు కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. ఈ వాహనాల్లోని ఫ్యూయల్ లెవెల్ ఇండికేటర్, వార్నింగ్ లైట్ ఇంధన స్థాయిని సరిగ్గా చూపించకపోవచ్చని తెలిపింది. సమస్య ఉన్న స్పీడోమీటర్ అసెంబ్లీని ఉచితంగా తనిఖీ చేసి, అవసరమైతే మార్చి ఇస్తామని స్పష్టం చేసింది. ప్రభావిత వాహన యజమానులను మారుతి అధీకృత డీలర్ వర్క్‌షాప్‌లు సంప్రదిస్తాయని కంపెనీ వివరించింది. మరోవైపు అమ్మకాల్లో మారుతి సుజుకి దూకుడు ప్రదర్శిస్తోంది. గత అక్టోబర్‌లో మొత్తం 2,20,894 యూనిట్లను విక్రయించి, అంతకుముందు ఏడాదితో పోలిస్తే 7 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇదే సమయంలో దేశీయ అమ్మకాలు 1,80,675 యూనిట్లకు చేరి ఆల్-టైమ్ రికార్డు సృష్టించాయి.

# అల్ ఫలాహ్ వర్సిటీ విద్యార్థులు ఇంటి బాట

ఫరీదాబాద్: ఢిల్లీ కారు పేలుడు ఘటనకు సంబంధించిన దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ ఉగ్ర కుట్రకు అల్ ఫలా విశ్వవిద్యాలయం కేంద్ర బిందువుగా ఉండటం, ఇద్దరు వైద్యులను అరెస్టు చేయడంతో ఆ విశ్వవిద్యాలయంపై నిఘా మరింత పెరిగింది. అరెస్టైన ఇద్దరు వైద్యులు ఉగ్రవాది ఉమర్ నబీకి స్నేహితులుగా దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. దీంతో క్యాంపస్‌లో భద్రతను కట్టుదిట్టం చేయడంతో పాటు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయం విద్యార్థులు స్వస్థలాలకు వెళ్ళిపోతున్నారు. మరోవైపు తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల గురించి ఆందోళన చెందుతున్నారు. అల్ ఫలా విశ్వవిద్యాలయంలో విచారణ వేగంగా కొనసాగుతోంది. దర్యాప్తు బృందాలు సిబ్బందిని ప్రశ్నిస్తూ, రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అనుమానిత విద్యార్థుల ధృవీకరణ పత్రాలను కూడా పరిశీలిస్తున్నారు.

# డీఎంకేతోనే కాంగ్రెస్

**బీహార్ ఫలితాల ఎఫెక్ట్.. విజయ్ టీవీకేకు నిరాశ.. ప్రయోగాలపై వెనక్కి**



న్యూఢిల్లీ: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎదురైన ఘోర పరాభవం, తమిళనాడు రాజకీయ సమీకరణాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ ఫలితాల నేపథ్యంలో డీఎంకే కూటమి నుంచి బయటకు వచ్చి కొత్త ప్రయోగాలు చేసే ఆలోచనను కాంగ్రెస్ అధిష్ఠానం దాదాపుగా విరమించుకున్నట్లు తెలుస్తోంది. దీంతో 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నాటికి కాంగ్రెస్‌ను తమ కూటమిలోకి తీసుకురావాలని ఆశించిన నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళ వెట్రి కళగం పార్టీకి పెద్ద నిరాశే ఎదురైంది. బీహార్‌లో పుంజుకోవాలని భావించిన కాంగ్రెస్ పార్టీకి అనూహ్యమైన దెబ్బ తగలడంతో ఇప్పటికే బలంగా ఉన్న పొత్తులను కొనసాగించడమే మేలని పార్టీ కేంద్ర నాయకత్వం భావిస్తోంది. తమిళనాడులో 2019 నుంచి డీఎంకే-కాంగ్రెస్ కూటమి వరుస విజయాలు సాధిస్తోంది. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో ఈ కూటమి మెరుగైన ఫలితాలు రాబట్టింది. జాతీయ స్థాయిలో పార్టీ వ్యూహాలను పునఃసమీక్షించుకుంటున్న తరుణంలో తమిళనాడులో విజయవంతమైన కూటమిని వదులుకోవడానికి అధిష్ఠానం సిద్ధంగా లేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు కాంగ్రెస్‌ను కలుపుకొని డీఎంకే, అన్నాడీఎంకేలకు ప్రత్యామ్నాయంగా బలమైన కూటమిని నిర్మించాలని టీవీకే ఆశించింది. నటుడు విజయ్ ఇటీవల స్థిరమైన సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని పిలుపునివ్వడంతో కాంగ్రెస్ తమతో కలుస్తుందని టీవీకే నేతలు గట్టిగా నమ్మారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వంపై అసంతృప్తిగా ఉన్న కొందరు ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లా స్థాయి నేతలు టీవీకే వైపు చూస్తున్నారనే ప్రచారం కూడా జరిగింది. తమ కూటమిలో చేరితే ఎక్కువ సీట్లు, మంత్రి పదవులు దక్కుతాయని వారు భావించారు. రాష్ట్రవ్యాప్తంగా తమకు 26 శాతం ప్రజాదరణ ఉందని టీవీకే అంతర్గత సర్వేలు చెబుతున్నాయని, కాంగ్రెస్ తోడైతే త్రిముఖ పోరులో గట్టి పోటీ ఇవ్వొచ్చని ఆ పార్టీ నేతలు అంచనా వేశారు. విజయ్, రాహుల్ గాంధీ మధ్య 2012 నుంచి ఉన్న స్నేహం కూడా పొత్తు చర్చలకు దోహదపడుతుందని భావించారు. అయితే, బీహార్ ఫలితాలతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కొత్త ప్రయోగాలతో రిస్క్ తీసుకునే బదులు, స్థిరమైన, విజయవంతమైన డీఎంకే కూటమిలోనే కొనసాగడం ఉత్తమమని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

# బీబీసీపై భారీ దావాకు ట్రంప్!

**5 బిలియన్ డాలర్ల దావా వేస్తానన్న ట్రంప్**

**తన ప్రసంగాన్ని తప్పుగా ఎడిట్ చేశారని ఆరోపణ**

**వచ్చే వారం దావా వేయనున్నట్టు పేర్కొన్న అమెరికా అధ్యక్షుడు**




వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రముఖ మీడియా సంస్థ బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బీబీసీ) మధ్య వివాదం ముదురుతోంది. 2021లో తాను చేసిన ప్రసంగాన్ని తప్పుగా ఎడిట్ చేసి ప్రసారం చేశారని ఆరోపిస్తూ, బీబీసీపై వచ్చే వారం 5 బిలియన్ డాలర్ల వరకు పరువు నష్టం దావా వేయనున్నట్లు ట్రంప్ శుక్రవారం ప్రకటించారు. 2021 జనవరి 6న యూఎస్ క్యాపిటల్ భవనంపై తన మద్దతుదారులు దాడి చేసిన రోజున ట్రంప్ చేసిన ప్రసంగాన్ని బీబీసీ తన డాక్యుమెంటరీలో వక్రీకరించిందని ట్రంప్ న్యాయవాదులు ఆరోపిస్తున్నారు. డాక్యుమెంటరీని ఉపసంహరించుకుని, క్షమాపణ చెప్పడంతో పాటు ఒక బిలియన్ డాలర్లకు తగ్గకుండా నష్టపరిహారం చెల్లించాలని వారు శుక్రవారాన్ని గడువుగా విధించారు. ఈ డాక్యుమెంటరీ వల్ల తమ క్లయింట్ కీర్తి ప్రతిష్ఠలకు, ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లిందని వారు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై బీబీసీ స్పందిస్తూ, ట్రంప్ ప్రసంగాన్ని ఎడిట్ చేయడం తప్పుడు నిర్ణయం అని అంగీకరించింది. గురువారం ట్రంప్‌కు వ్యక్తిగతంగా క్షమాపణలు కూడా తెలియజేసింది. అయితే, తమపై దావా వేయడానికి ఎలాంటి చట్టపరమైన ఆధారాలు లేవని స్పష్టం చేసింది. దీనిపై ఫ్లోరిడా పర్యటనకు వెళ్తూ ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో విలేకరులతో మాట్లాడిన ట్రంప్, "మేము వారిపై 1 నుంచి 5 బిలియన్ డాలర్ల వరకు దావా వేస్తాం. బహుశా వచ్చే వారం ఇది జరగవచ్చు. వారు నా నోటి నుంచి వచ్చిన మాటలనే మార్చేశారు. వారే మోసం చేశారని అంగీకరించినప్పుడు నేను దావా వేయక తప్పదు" అని అన్నారు. ఈ విషయంపై బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో ఇంకా మాట్లాడలేదని, ఈ వారాంతంలో ఫోన్ చేసి చర్చిస్తానని ట్రంప్ తెలిపారు. బీబీసీ తన ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్ పనోరమాలో ప్రసారం చేసిన ఈ డాక్యుమెంటరీలో ట్రంప్ ప్రసంగంలోని మూడు వేర్వేరు వీడియో భాగాలను కలిపి.. అల్లర్లను ఆయనే రెచ్చగొట్టినట్లుగా చిత్రీకరించారని, ఇది పూర్తిగా అవాస్తవం, పరువు నష్టం కలిగించే చర్య అని ట్రంప్ న్యాయవాదులు వాదిస్తున్నారు.

# నౌగామ్ ఘటన ప్రమాదమే

**ఉగ్రకుట్ర కాదు: జమ్ముకశ్మీర్ డీజీపీ**

శ్రీనగర్: జమ్ము కశ్మీర్‌లోని నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో సంభవించిన భారీ పేలుడులో 9 మంది మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ పేలుడు వెనుక ఉగ్రవాద కుట్ర ఉందన్న ప్రచారంపై రాష్ట్ర డీజీపీ నళిన్ ప్రభాత్ స్పందించారు. ఉగ్రవాద కుట్ర ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. ఇది ప్రమాదవశాత్తు జరిగిందని ఆయన వెల్లడించారు. ర్యానాలోని ఫరీదాబాద్‌లో ఉగ్ర మాడ్యూల్‌ను ఛేదించిన అధికారులు, అక్కడి నుంచి పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వాటి నుంచి నమూనాలు (శాంపిల్స్) సేకరిస్తుండగా భారీ విస్ఫోటనం జరిగింది. ఇది ప్రమాదవశాత్తు జరిగిందని భావించినప్పటికీ, జైషేకు అనుబంధ సంస్థ అయిన పీపుల్స్ యాంటీ ఫాసిస్ట్ ఫోర్స్ ఈ దాడి తమ పనేనని ప్రకటించింది. అయితే డీజీపీ దీనిని ఖండించారు. ఇది ప్రమాదవశాత్తు జరిగిన ఘటన అని స్పష్టం చేశారు. జీపీ మీడియాతో మాట్లాడుతూ, ఫరీదాబాద్ నుంచి స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలను ఫోరెన్సిక్ పరీక్షకు పంపించేందుకు సిద్ధం చేశామన్నారు. ఫోరెన్సిక్ సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఉన్నప్పటికీ, దురదృష్టవశాత్తు పేలుడు సంభవించిందని తెలిపారు. మృతి చెందిన తొమ్మిది మందిలో ముగ్గురు ఫోరెన్సిక్ సిబ్బంది, రాష్ట్ర వైద్య సంస్థకు చెందిన ఒకరు, ఇద్దరు క్రైమ్ ఫొటోగ్రాఫర్లు, ఇద్దరు రెవెన్యూ అధికారులు, ఒక టైలర్ ఉన్నారని ఆయన పేర్కొన్నారు. 32 మంది గాయపడగా, వారికి చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. పేలుడు ధాటికి పోలీస్ స్టేషన్ పూర్తిగా దెబ్బతిన్నదని, సమీపంలోని భవనాలు కూడా ప్రభావితమయ్యాయని ఆయన తెలిపారు. నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన పేలుడుపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ స్పందించింది. ఈ దుర్ఘటనలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారని, 27 మంది పోలీసులు, ఇద్దరు రెవెన్యూ అధికారులు, ముగ్గురు పౌరులు గాయపడ్డారని పేర్కొంది. నౌగామ్ పేలుడుపై మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ (జమ్ము కశ్మీర్ డివిజన్) ప్రశాంత్ లోఖండే మాట్లాడుతూ, పేలుడు కారణంగా పోలీస్ స్టేషన్ భవనంతో పాటు చుట్టుపక్కల ఉన్న కొన్ని నిర్మాణాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు.

ఒయ్యారి చిత్రం


మాళవిక మోహనన్

## శ్రీరాముడిగా- రుద్రుడిగా
# మహేష్‌బాబు!



హైదరాబాద్‌లో జరిగిన గ్లోబ్‌ట్రాటర్ ఈవెంట్‌లో ఎస్ఎస్ రాజమౌళి ఎస్ఎస్ఎమ్‌బీ29 కి 'వారణాసి' అనే టైటిల్ ని ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్ లో మహేష్ బాబు పాత్రను రుద్రుడిగా పరిచయం చేశారు. ఆసక్తికరంగా వేదికపై రాజమౌళి మాట్లాడుతూ సినిమాలోని ఒక ప్రత్యేక ఎపిసోడ్ కోసం మహేష్ తో శ్రీరాముడి గెటప్ వేయించానని తెలిపారు. రాముడి గెటప్ లో అతడు అద్భుతంగా కుదిరాడని కూడా కితాబిచ్చారు. దీనిని బట్టి మహేష్ ఈ చిత్రంలో శ్రీరాముడిగా, శివుడిగాను ద్విపాత్రలలో చూసి అభిమానులు ఆనందించవచ్చు. అలాగే మోడ్రన్ డే కుర్రాడిగాను అతడు నందీశ్వరుడిపై దూసుకెళుతున్న విజువల్స్ ఇప్పటికే ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి. ఇక ప్రపంచ సాహస యాత్రికుడిగా మహేష్ పాత్రను డిఫరెంట్ షేడ్స్ లో రాజమౌళి ఆవిష్కరిస్తున్న తీరు సర్వత్రా ఉత్కంఠను కలిగిస్తోంది. మొదటి గ్లింప్స్ మహేష్‌ను యోధుడిగా ఆవిష్కరించింది. త్రిశూలం పట్టుకుని, ముఖంపై రక్తపు మరకలతో నందీశ్వరుడిపై దూసుకుపోతున్న వీరుడిని తలపించాడు. చవారణాసిలో రుద్రుడిగా మహేష్ బాబును పవర్ ఫుల్ గా రాజమౌళి ఆవిష్కరిస్తున్నారు. నాకు రామాయణం, మహాభారతం అంటే చాలా ఇష్టం. పురాణాలపై సినిమా తీయాలనుకున్నాను.. నిజానికి ఈ సినిమా మొదలు పెట్టినప్పుడు కూడా రామాయణంలో ఒక ముఖ్య ఘట్టంపై సన్నివేశాలు తీస్తానని అనుకోలేదు ఒక్కో సీన్ రాస్తుంటే, ఒక్కో ఘట్టం రాస్తుంటే ఫీల్ పుట్టుకొచ్చింది... ఎమోషనల్ అయ్యాను.. నేను నేలమీద నడవలేదు అనిపించిందని రాజమౌళి అన్నారు. మహేష్‌కి రాముడి వేషం వేయించి తీసుకొచ్చి ఫోటోషూట్ చేస్తుంటే నాకు గూస్ బంప్స్ వచ్చాయి. నాలో నేనే సగం డైలమాలో ఉన్నాను.. మహేష్ కొంటెగా ఉంటాడు కృష్ణుడిలా ఉండాలనుకున్నా.. రాముడి పాత్రకు సరిపోతాడా? అనుకుంటూనే డైలమాలోనే ఫోటోషూట్ చేసాము. కానీ అతడు బాగా సరిపోయాడు. మొదటి ఫోటోని నా వాల్ పేపర్ కింద పెట్టుకున్నాను. పొరపాటున ఎవరైనా చూసేస్తారేమో అని జాగ్రత్త పడ్డాను.. అంత బాగా రాముడి పాత్రకు మహేష్ కుదిరాడని తెలిపారు రాజమౌళి. మహేష్ పై ఈ ఎపిసోడ్ ని 60 రోజుల పాటు చిత్రీకరించాం. ఇటవలే ఆ సీన్ ని పూర్తి చేసాం. ఆ ఎపిసోడ్ లో ప్రతి సబ్ ఎపిసోడ్ ఒక సినిమాలాగా ఉంటుంది. ప్రతిదీ కొత్తగా ఆలోచించి ప్లాన్ చేసి తీసాం. ప్రతిదీ ఒక ఛాలెంజింగ్.. అన్ని ఆటంకాలను ఎదుర్కొని ఈ ఎపిసోడ్ ని పూర్తి చేసాం. అది మహేష్ సినిమాల్లోనే మెమరబుల్ గా ఉంటుంది.

## రజనీతో మూవీ.. కమల్ ఏమన్నారంటే?



కోలీవుడ్ సినీ ఇండస్ట్రీలో స్టార్ హీరోలుగా పేరు సొంతం చేసుకున్న రజనీకాంత్ – కమలహాసన్ ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో కలిసి చాలా చిత్రాలలో నటించారు. కానీ ఆ తర్వాత కాలంలో ఏమైందో తెలియదు కానీ మళ్లీ వీరిద్దరూ కలిసి నటించిన దాఖలాలు లేవు. అలా దాదాపుగా మూడు దశాబ్దాలు గడిచిపోయాయి. కానీ ఇప్పుడు మళ్ళీ వీరిద్దరూ కలిసి నటించాలని ఒక వర్గం ఆడియన్స్ పెద్ద ఎత్తున కోరుకుంటున్న నేపథ్యంలో అటు వీళ్లిద్దరూ కూడా సినిమా చేయడానికి సిద్ధమయ్యారు. ముఖ్యంగా వీళ్ళిద్దరూ కలిసి మల్టీ స్టారర్ సినిమాలో నటిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఆ సినిమా కంటే ముందే రజనీకాంత్ తన 173వ చిత్రాన్ని కమలహాసన్ నిర్మాణ సంస్థ ద్వారా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి మొదట కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ సుందర్ సి దర్శకత్వం వహిస్తారు అంటూ అధికారికంగా ప్రకటించారు. కానీ అనూహ్యంగా ఈ ప్రాజెక్టు నుంచి సుందర్ సి తప్పుకుంటూ ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిపై కమలహాసన్ మాట్లాడుతూ.. "నేను ఈ సినిమాకు నిర్మాతని.. నా చిత్ర నటుడు రజనీకాంత్ ను నేను సంతృప్తి పరచాలి. అందుకే అనేక స్క్రిప్టను వింటున్నాము. రజినీకాంత్ స్క్రిప్ట్ ను ఓకే చేసిన తర్వాతనే ప్రాజెక్టు లాక్ చేయబడుతుంది.

## 2027 వేసవిలో వారణాసి



మహేష్ బాబు -రాజమౌళి కాంబినేషన్ మూవీ వారణాసి. గ్రాండ్ టైటిల్ ఈవెంట్ హైదరాబాద్ రామోజీ ఫిలింసిటీలో వైభవంగా జరిగింది. అయతే ఈ ఈవెంట్ ప్రారంభం కావడానికి ముందే టైటిల్ లీక్ అయింది. ఈ వేదికపై రాజమౌళి మాట్లాడుతూ.. ఒకరోజు ముందు టెస్ట్ డ్రైవ్ చేస్తున్నప్పుడు ఒక డ్రోన్ వచ్చి ప్రతిదీ షూట్ చేసి వెళ్లిందని, కోట్లాది రూపాయలు వెచ్చించి శ్రమిస్తే తమ శ్రమంతా బూడిదలో పోసినట్టయిందని ఆవేదన చెందారు. ఇక ఈ వేదికపై అద్భుత ప్రసంగంతో ఆకట్టుకున్న ఎం.ఎం.కీరవాణి, వారణాసి రిలీజ్ సమయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి మాట్లాడుతూ--వారణాసి 2027 వేసవిలో విడుదలవుతుంద-ని వెల్లడించారు. ఈ వేసవి నుండి మహేష్ బాబు అభిమానుల హృదయాల్లో తాను శాశ్వత స్థానాన్ని సంపాదిస్తానని ఆయన అన్నారు. మెలోడీలే కాదు ఇకపై అన్ని రకాల బాణీలతోను అదరగొడతానని ఈ సినిమా నిరూపిస్తుందని కీరవాణి ఛాలెంజ్ చేసారు. బీట్ విషయంలో తనపై వచ్చిన అపప్రద తొలగిపోతుందని కీరవాణి అన్నారు. ఇక రాజమౌళి-మహేష్‌తో 15 ఏళ్ల క్రితమే సినిమా కోసం ప్రయత్నించానని దుర్గా ఆర్ట్స్ అధినేత, సీనియర్ నిర్మాత కెఎల్ నారాయణ వేదికపై వెల్లడించారు.

## అనుభవంతోనే
# తెలుసుకున్నా

అన్నీ తెలుసని అనుకున్న రోజే తమకు అదే చివరి రోజు అవుతుందని అభిప్రాయపడింది. 'కొందరు తమని తప్పు అంటే ఎంత మాత్రం ఒప్పుకోరు. తామే రైట్ అని బుకాయిస్తారు? చేసిన పని తప్పు అని ఒప్పుకోవడానికి వాళ్లకి ఎంత మాత్రం మనసు రాదు. తప్పును స్వీకరించడంలో తప్పముంది? నేనెప్పుడు తప్పుడు, వైఫల్యాల గురించి భయపడను.తప్పులు చేయడం ద్వారా కొత్త విషయాలు తెలుస్తాయి. చేసిన తప్పును మళ్లీ చేయకుండా జాగ్రత్త పడతాం. పిల్లలకు కూడా అంతే నడిచే వయసులో పిల్లలు చాలాసార్లు కింద పడతారు. అలా పడినప్పుడే మళ్లీ లేచి ఎంత బలంగా నడవగలం అన్నది వాళ్లకీ అర్దమవుతుంది. కింద పడ్డామని భయపడి పైకి లేవడం మానేయరుగా. ఆ క్షణానికి భయపడినా తగిలిన గాయం మానిన తర్వాత మళ్లీ లేచి నడక మొదలు పెడతారు. అందుకే జీవితంలో ప్రతీ దశకు, ప్రతీ వృత్తికి ఇది వర్తిస్తుందని నేను నమ్ముతాను. కొన్నిసార్లు తప్పులు కూడా మంచి చేస్తాయన్నారు. 'ఈ విషయాన్ని అనుభవ పూర్వకంగానే తెలుసుకున్నాను.





## 8 గంటల పనిదినం
# కోసం పోరాడతా

'8 గంటల పనిదినం మాత్రమే కావాలి.. ఓవర్ టైమ్ నా వల్ల కాదు!' అంటూ నిర్మొహమాటంగా చెప్పేయడంతోనే దీపిక పదుకొనేను సందీప్ వంగా స్పిరిట్ నుంచి తొలగించారా? ఇటీవలి కాలంలో దీపికకు మద్ధతు పలుకుతున్నవారంతా చెబుతున్న పాయింట్ ఇది. అయితే ఒక బిడ్డ తల్లిగా దీపిక ఇలా కోరితే అది సమంజసమే కానీ, ఇంకా బయటకు తెలియని కొన్ని ఇతర విషయాలు కూడా ఈ త్రో - ఔట్ సీన్ కి కారణమయ్యాయని తెలుస్తోంది. ప్రభాస్ సరసన స్పిరిట్ తో పాటు కల్కి సీక్వెల్ కల్కి 2898 ఏడి నుంచి కూడా దీపికను తొలగించారు. ఈ రెండు సినిమాలను కోల్పోయినా కానీ, దీపిక బాణీ ఎక్కడా మారలేదు. తాను 8గంటల పనిదినానికి కట్టుబడి ఉన్నానని దీపిక పదే పదే ప్రకటిస్తోంది. తాను మాత్రమే కాదు.. ఇకపై తల్లులు ఎవరైనా సెట్స్ లో ఉంటే వారు 8 గంటలు మాత్రమే పని చేసేలా తాను ఏదో ఒకటి చేస్తానని కూడా ప్రకటించేసింది దీపిక.



## డ్రగ్స్ రాకెట్‌లో శ్రద్ధా కపూర్, నోరా ఫతేహీ?

డ్రగ్ రాకెట్‌కు సంబంధించి జరిగిన పార్టీలలో పలువురు సెలబ్రిటీలు పాల్గొన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ లిస్ట్‌లో స్టార్ హీరోయిన్ శ్రద్ధా కపూర్, ప్రముఖ డాన్సర్ నోరా ఫతేహి పేర్లు ఉన్నట్లు జాతీయ మీడియాలో ప్రచారం జరుగుతోంది. వీరితో పాటు శ్రద్ధా సోదరుడు సిద్ధాంత్ కపూర్, సోషల్ మీడియా స్టార్ ఓర్రీ, దర్శకులు అబ్బాస్ మస్తాన్, రాజకీయ నాయకుడి కుమారుడు జీషాన్ సిద్దిఖీ పేర్లు కూడా నార్త్ మీడియాలో వినిపిస్తున్నాయి. ఈ రాకెట్‌కు సంబంధించి ముంబై, దుబాయ్‌లలో భారీ పార్టీలు జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ పార్టీలను మహమ్మద్ సలీం సుహైల్ షేక్ అనే వ్యక్తి నిర్వహించినట్లు సమాచారం. ఇతను అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం అనుచరుడు సలీం డోలాకు అత్యంత సన్నిహితుడని రిపోర్ట్స్ చెబుతున్నాయి. ఈ కేసులో మరో కీలకమైన కోణం కూడా వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది.

# 10 ఫ్రాంచైజీల వారిగా రిటైన్, రిలీజ్ ఆటగాళ్ల జాబితా

## ఢిల్లీ క్యాపిటల్స్

**రిలీజ్ లిస్ట్:** ఫాఫ్ డుప్లెసిస్, జాక్ ఫ్రెజర్ మెక్‌గర్క్, డోనావన్ ఫెర్రెరా(ట్రేడ్ ఔట్), సెదిఖుల్లా అటల్, మానవ్ కుమార్, మోహిత్ శర్మ, దర్శన్ నల్కండే

**రిటైన్ లిస్ట్:** ట్రిస్టన్ స్టబ్స్, సమీర్ రిజ్వీ, కరుణ్ నాయర్, కేఎల్ రాహుల్, అభిషేక్ పోరెల్, అక్షర్ పటేల్, అషుతోష్ శర్మ, విప్రజ్ నిగమ్, మాదవ్ తివారి, త్రిపుర విజయ్, అజయ్ మండల్, కుల్దీప్ యాదవ్, మిచెల్ స్టార్క్, టీ నటరాజన్, ముఖేష్ కుమార్, దుష్మంత్ చమీరా

మిగిలిన పర్స్ వాల్యూ: రూ.21.8 కోట్లు
కొనుగోలు చేయాల్సిన ఆటగాళ్ల సంఖ్య:8

## రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు

**రిలీజ్ లిస్ట్:** స్వస్తిక్ చికరా, మయాంక్ అగర్వాల్, టీమ్ సిఫెర్ట్, లియామ్ లివింగ్ స్టోన్, మనోజ్ భాండగే, లుంగి ఎంగిడి, బ్లెస్సింగ్ ముజర్బానీ, మోహిత్ రతీ

**రిటైన్ లిస్ట్:** రజత్ పటీదార్(కెప్టెన్), విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, ఫిల్ సాల్ట్, జితేశ్ శర్మ, కృనాల్ పాండ్యా, స్వప్నిల్ సింగ్, టీమ్ డేవిడ్, రొమారియో షెఫర్డ్, జాకోబ్ బెతెల్, జోష్ హాజెల్ వుడ్, యశ్ దయాల్, భువనేశ్వర్ కుమార్, నువాన్ తుషార, రసిక్ సలామ్, అభినందన్ సింగ్, సుయాశ్ శర్మ

మిగిలిన పర్స్ విలువ: రూ.16.4 కోట్లు
కొనుగోలు చేయాల్సిన ఆటగాళ్ల సంఖ్య:8

## రాజస్థాన్ రాయల్స్

**రిలీజ్ లిస్ట్:** కృనాల్ సింగ్ రాథోడ్, నితీష్ రాణా(ట్రేడ్ ఔట్), సంజూ శాంసన్(ట్రేడ్ ఔట్), వానిందు హసరంగా, మహీష్ తీక్షణ, ఫజలక్ ఫరూఖీ, ఆకాశ్ మద్వాల్, ఆశోక్ శర్మ, కుమార్ కార్తీకేయ

**రిటైన్ లిస్ట్:** యశస్వి జైస్వాల్, షిమ్రాన్ హెట్‌మైర్, వైభవ్ సూర్యవంశీ, శుభమ్ దూబే, లుహన్ డ్రీ ప్రిటోరియస్, ధ్రువ్ జురెల్, రియాన్ పరాగ్, రవీంద్ర జడేజా(ట్రేడ్ ఇన్), సామ్ కరణ్(ట్రేడ్ ఇన్), డీ ఫెర్రెరియా(ట్రేడ్ ఇన్), జోఫ్రా ఆర్చర్, తుషార్ దేశ్‌పాండే, సందీప్ శర్మ, యుధ్‌వీర్ శర్మ, క్వేన్ మఫకా, నంద్రే బర్గర్.

మిగిలిన పర్స్ విలువ: రూ.16.05 కోట్లు
కొనుగోలు చేయాల్సిన ఆటగాళ్ల సంఖ్య:9

## గుజరాత్ టైటాన్స్

**రిలీజ్ లిస్ట్:** షెర్ఫెన్ రూథర్‌ఫోర్డ్(ట్రేడ్ ఔట్), మహిపాల్ లోమ్రోర్, కరీమ్ జనత్, దసన్ షనక, గెరాల్డ్ కోయిట్జీ, కుల్వంత్ ఖెజ్రోలియా

**రిటైన్ లిస్ట్:** శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్, కుమార్ కుశాగ్ర, అనుజ్ రావత్, జోస్ బట్లర్, నిషాంత్ సింధు, వాషింగ్టన్ సుందర్, అర్షద్ ఖాన్, షారూఖ్ ఖాన్, రాహుల్ తెవాటియా, కగిసో రబడా, మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, ఇషాంత్ శర్మ, రషీద్ ఖాన్, గుర్నూర్ సింగ్ బ్రార్, మానవ్ సుతార్, సాయి కిషోర్, జయంత్ యాదవ్.

మిగిలిన పర్స్ విలువ: రూ.12.9 కోట్లు
కొనుగోలు చేయాల్సిన ఆటగాళ్ల సంఖ్య:5

# మినీ వేలం రిటెన్షన్ లిస్ట్




**ఐపీఎల్ 2026 సీజన్ మినీ వేలం నేపథ్యంలో 10 ఫ్రాంచైజీలు తమ రిటెన్షన్ జాబితాలను ప్రకటించాయి. ఈ వివరాలను అధికార బ్రాడ్‌కాస్టర్ స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్ వేదికగా వెల్లడించారు. పది జట్లు తమకు అవసరమైన ఆటగాళ్లను రిటైన్ చేసుకొని భారంగా మారిన ప్లేయర్లను వేలంలోకి వదిలేసాయి. అత్యధికంగా కేకేఆర్ 10 మంది ఆటగాళ్లను వదిలేయగా.. అత్యల్పంగా పంజాబ్ కింగ్స్ ఐదుగురు ఆటగాళ్లను మాత్రమే రిలీజ్ చేసింది. దాంతో డిసెంబర్ 16న అబుదాబి వేదికగా జరగనున్న వేలంలో కేకేఆర్ అత్యధికంగా రూ.64.3 కోట్ల పర్స్ మనీతో బరిలోకి దిగనుంది.**

## కోల్‌కతా నైట్‌రైడర్స్

**రిలీజ్ లిస్ట్:** లవ్‌నిత్ సిసోడియా, క్వింటన్ డికాక్, రెహ్మానుల్లా గుర్బాజ్, మోయిన్ అలీ, వెంకటేశ్ అయ్యర్, ఆండ్రీ రస్సెల్, మయాంక్ మార్కండే, చేతన్ సకారియా, అన్రిచ్ నోర్జ్, స్పెన్సర్ జాన్సన్.

**రిటైన్ లిస్ట్:** రింకూ సింగ్, అంగ్‌క్రిష్ రఘువంశీ, రోవ్‌మన్ పోవెల్, అజింక్యా రహానే(కెప్టెన్), మనీష్ పాండే, సునీల్ నరైన్, రమణ్‌దీప్ సింగ్, అనుకుల్ రాయ్, వరుణ్ చక్రవర్తీ, హర్షిత్ రాణా, వైభవ్ అరోరా, ఉమ్రాన్ మాలిక్.

మిగిలిన పర్స్ విలువ: రూ.64.3 కోట్లు
కొనుగోలు చేయాల్సిన ఆటగాళ్ల సంఖ్య:13

## చెన్నై సూపర్ కింగ్స్

**రిలీజ్ లిస్ట్:** రాహుల్ త్రిపాఠి, వాన్ష్ బేడీ, ఆండ్రూ సిద్దార్థ్, రచిన్ రవీంద్ర, సామ్ కరణ్, దీపక్ హుడా, విజయ్ శంకర్, షేక్ రషీద్, కమలేష్ నాగర్‌కోటి, మతీష పతీరణ.

**రిటైన్ లిస్ట్:** రుతురాజ్ గైక్వాడ్(కెప్టెన్), ఆయుష్ మాత్రే, డెవాల్డ్ బ్రెవిస్, మహేంద్ర సింగ్ ధోనీ, ఉర్విల్ పటేల్, సంజూ శాంసన్(ట్రేడ్ ఇన్), డేవాన్ కాన్వే, రవీంద్ర జడేజా, శివమ్ దూబే, జేమీ ఓవర్టన్, రామకృష్ణ ఘోష్, నూర్ అహ్మద్, ఖలీల్ అహ్మద్, అన్షుల్ కంబోజ్, గుర్జన్‌ప్రీత్ సింగ్, నాథన్ ఎల్లిస్, శ్రేయస్ గోపాల్, ముఖేష్ చౌదరి.

మిగిలిన పర్స్ వాల్యూ: రూ. 43.4 కోట్లు
కొనుగోలు చేయాల్సిన ఆటగాళ్ల సంఖ్య: 9

## సన్‌రైజర్స్ హైదరాబాద్

**రిలీజ్ లిస్ట్:** అభినవ్ మనోహర్, అథర్వ టైడ్, సచిన్ బేబీ, వియాన్ మల్డర్, మహమ్మద్ షమీ, సిమర్జిత్ సింగ్, రాహుల్ చాహర్, ఆడమ్ జంపాలను

**రిటైన్ లిస్ట్:** ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, అనికేత్ వర్మ, ఆర్ సమరన్, ఇషాన్ కిషన్, హెన్రీచ్ క్లాసెన్, నితీష్ కుమార్ రెడ్డి, హర్ష్ దూబే, కామిందు మెండీస్, హర్షల్ పటేల్, బ్రైడన్ కార్స్, ప్యాట్ కమిన్స్, జయదేవ్ ఉనాద్కత్, ఇషాన్ మలింగా, జీషన్ అన్సారీ.

మిగిలిన పర్స్ వాల్యూ: రూ.25.5 కోట్లు
కొనుగోలు చేయాల్సిన ఆటగాళ్ల సంఖ్య:10

## లక్నో సూపర్ జెయింట్స్

**రిలీజ్ లిస్ట్:** ఆర్యన్ జుయల్, డేవిడ్ మిల్లర్, యువరాజ్ చౌదరీ, రాజ్‌వర్దన్ హంగార్గేకర్, శార్దూల్ ఠాకూర్(ట్రేడ్ ఔట్), ఆకాష్ దీప్, రవి బిష్ణోయ్, షమర్ జోసెఫ్

**రిటైన్ లిస్ట్:** అబ్దుల్ సమద్, ఆయుష్ బదోని, ఎయిడెన్ మార్క్‌రమ్, మాథ్యూ బ్రిట్జ్‌కే, హిమ్మత్ సింగ్, రిషభ్ పంత్, నికోలస్ పూరన్, మిచెల్ మార్ష్, షెహ్‌బాజ్ అహ్మద్, అర్షిన్ కులకర్ణి, మహమ్మద్ షమీ(ట్రేడ్ ఇన్), మయాంక్ యాదవ్, ఆవేష్ ఖాన్, ఎమ్ సిద్దార్థ్, దిగ్వేష్ రతి, ప్రిన్స్ యాదవ్, ఆకాష్ సింగ్.

మిగిలిన పర్స్ వాల్యూ: రూ.22.95 కోట్లు
కొనుగోలు చేయాల్సిన ఆటగాళ్ల సంఖ్య:6

## పంజాబ్ కింగ్స్

**రిలీజ్ లిస్ట్:** జోష్ ఇంగ్లీస్, ఆరోన్ హార్డీ, గ్లేన్ మ్యాక్స్‌వెల్, కుల్దీప్ సేన్, ప్రవీణ్ దూబే

**రిటైన్ లిస్ట్:** శ్రేయస్ అయ్యర్, నెహాల్ వధేరా, ప్రియాన్ష్ ఆర్య, శశాంక్ సింగ్, పైలా అవినాష్, హర్నూర్ పన్ను, ముషీర్ ఖాన్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్, విష్ణు వినోద్, మార్కస్ స్టోయినీస్, మార్కో జాన్సెన్, అజ్మతుల్లా ఒమర్జాయ్, సర్యాన్ష్ షెగ్డే, మిచెల్ ఓవెన్, అర్షదీప్ సింగ్, వైశాఖ్ విజయ్‌కుమార్, యశ్ ఠాకూర్, గ్జేవియర్ బార్ట్‌లెట్, లాకీ ఫెర్గ్యూసన్, యుజ్వేంద్ర చాహల్, హర్‌ప్రీత్ బ్రార్.

మిగిలిన పర్స్ విలువ: రూ.11.5 కోట్లు
కొనుగోలు చేయాల్సిన ఆటగాళ్ల సంఖ్య:4

## ముంబై ఇండియన్స్

**రిలీజ్ లిస్ట్:** సత్య నారయణ రాజు, రీస్ టాప్లీ, కేఎల్ శ్రీజిత్, కర్ణ్ శర్మ, అర్జున్ టెండూల్కర్(ట్రేడ్ ఔట్), బెవాన్ జేకబ్స్, ముజీబ్ ఉర్ రెహ్మాన్, లిజాడ్ విలియమ్స్, విఘ్నేష్ పుత్తూర్

**రిటైన్ లిస్ట్:** హార్దిక్ పాండ్యా, రోహిత్ శర్మ, జస్‌ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, నమన్ ధీర్, ట్రెంట్ బౌల్ట్, ర్యాన్ రికెల్టన్, దీపక్ చాహర్, విల్ జాక్స్, అశ్వని కుమార్, మిచెల్ సాంట్నర్, రాజ్ బవా, రాబిన్ మింజ్, షెర్ఫేన్ రూథర్‌పోర్డ్(ట్రేడ్ ఇన్), శార్దూల్ ఠాకూర్(ట్రేడ్ ఇన్), మయాంక్ మార్కండే(ట్రేడ్ ఇన్)

మిగిలిన పర్స్ విలువ: రూ.2.75 కోట్లు, కొనుగోలు చేయాల్సిన ఆటగాళ్ల సంఖ్య:5

# తొలి టెస్టులో గెలుపు వాకిట భారత్

### జడేజా జోరుతో సఫారీలు డీలా




ఈడెన్ గార్డెన్స్‌లో జతొలి టెస్టులో భారత్ పట్టుబిగించింది. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా(4-29) స్పిన్ మ్యాజిక్‌తో దక్షిణాఫ్రికా బ్యాటర్లు తోకముడవగా మ్యాచ్ టీమిండియా గుప్పిట్లోకి వచ్చింది. తొలి ఇన్నింగ్స్‌లో స్వల్ప ఆధిక్యమే వచ్చినా.. స్పిన్ ద్వయం కుల్దీప్, జడ్డూలు తిప్పేయడంతో రెండో ఇన్నిగ్స్‌లోనూ పర్యాటక జట్టు ఆలౌట్ ప్రమాదంలో పడింది. ప్రధాన ఆటగాళ్లు చేతులెత్తేయగా కెప్టెన్ తెంబ బవుమా(29 నాటౌట్) పోరాడుతున్నాడు. రెండోరోజు మ్యాచ్‌ను శాసించిన భారత్ మూడో రోజే జయభేరి మోగించడం ఖాయం. సొంతగడ్డపై మరో టెస్టు సిరీస్‌లోనూ భారత జట్టు గెలుపు వాకిట నిలిచింది. ఈడెన్ గార్డెన్స్‌లో స్వల్ప స్కోర్లు నమోదైన మ్యాచ్‌లో.. బౌలర్ల జోరుతో టీమిండియా పట్టుబిగించింది. ఓవర్ నైట్ స్కోర్ 37/1తో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్‌ను.. లెగ్ స్పిన్నర్ హర్మాన్(4-30) దెబ్బకొట్టాడు. అతడి విజృంభణతో ప్రధాన ఆటగాళ్లు పెవిలియన్ చేరగా.. దక్షిణాఫ్రికాకు 30 పరుగుల ఆధిక్యం లభించింది. దాంతో.. రెండో ఇన్నింగ్స్‌లో గొప్పగా ఆడి మ్యాచ్‌లో నిలవాలనుకున్న సఫారీలకు రవీంద్ర జడేజా(4-29) దిమ్మదిరిగే షాకిచ్చాడు. అతడికి చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్(2-12) కూడా తోడవ్వగా పర్యాటక జట్టు కష్టాలు రెట్టింపయ్యాయి. మార్కో యాన్సెన్ జతగా తెంబా బవుమా(29 నాటౌట్) కాసేపు ప్రతిఘటించారు. కానీ, కుల్దీప్ ఓవర్లో పెద్ద షాట్‌కు యత్నించిన యాన్సెన్ స్లిప్‌లో రాహుల్ చేతికి చిక్కాడు. దాంతో.. ఏడో వికెట్ కోల్పోయిన సఫారీ టీమ్ ఆలౌట్ అంచున నిలిచింది. అయితే.. వెలుతురు లేమి కారణంగా మరో పది ఓవర్లకు ముందు ఆటను నిలిపివేశారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ను ధాటిగా ఆరంభించింది. ఓపెనర్లు రియాన్ రికెల్టన్(23) ఎడెన్ మర్క్‌రమ్(31)లు ధనాధన్ ఆడుతూ భారత్‌పై ఒత్తిడి పెంచాలనుకున్నారు. తొలి వికెట్‌కు 57 రన్స్ జోడించిన ఈ ద్వయాన్ని జస్ప్రీత్ బుమ్రా విడదీసి వికెట్ల వేటకు తెరతీశాడు. మొదట రికెల్టన్‌ను బౌల్డ్ చేసిన యార్కర్ కింగ్ ఆ తర్వాత.. మర్క్‌రమ్‌ను పెవిలియన్ పంపాడు. ఆ తర్వాత కెప్టెన్ తెంబా బవుమా(3)ను కుల్దీప్ యాదవ్ బోల్తా కొట్టించాడు.

# నేడు భారత్ - పాక్ మ్యాచ్

### ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టీ20 టోర్నీలో దాయాదుల పోరు




ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టీ20 టోర్నీలో శుభారంభం చేసిన భారత్-ఏ జట్టు మరో రసవత్తర పోరుకు సిద్ధమైంది. శత్రు దేశం పాకిస్థాన్ షాహీన్స్‌తో ఆదివారం రాత్రి 8 గంటలకు ప్రారంభమయ్యే గ్రూప్‌బీ మ్యాచ్‌లో జితేశ్ శర్మ సారథ్యంలోని భారత్-ఏ జట్టు అమీతుమీ తేల్చుకోనుంది. యూఏఈతో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన భారత్-ఏ 148 పరుగుల భారీ తేడాతో రికార్డ్ విజయాన్నందుకుంది. టీమిండియా టీనేజ్ సెన్సేషన్, 14 ఏళ్ల సిక్సర పిడుగు వైభవ్ సూర్యవంశీ సునామీ ఇన్నింగ్స్‌తో టీమిండియా ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. 42 బంతుల్లోనే 144 పరుగులు చేసిన వైభవ్ సూర్యవంశీ.. 11 ఫోర్లు, 15 సిక్సర్లతో వీర విహారం చేశాడు. ఈ బుడ్డోడితో కెప్టెన్ జితేష్ శర్మ(32 బంతుల్లో 8 ఫోర్లతో 83 నాటౌట్)కూడా చెలరేగడంతో భారత్-ఏ జట్టు 297 పరుగుల రికార్డ్ స్కోర్ నమోదు చేసింది. అనంతరం యూఏఈ 149 పరుగులకే పరిమితమై ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. పాకిస్థాన్‌తో మ్యాచ్‌లోనూ ఇదే జోరును కొనసాగించాలని భారత్-ఏ జట్టు భావిస్తోంది. మరోవైపు పాకిస్థాన్ షాహీన్స్ కూడా యూఏఈపై 40 పరుగుల తేడాతో గెలుపొందింది. అయితే వైభవ్ సూర్యవంశీ మరో భారీ ఇన్నింగ్స్ ఆడితే పాకిస్థాన్ తేలిపోనుంది. వైభవ్ సంచలన బ్యాటింగ్‌తో ఈ భారత్-పాక్ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. గత కొన్నాళ్లుగా భారత్‌తో జరిగిన అన్నీ మ్యాచ్‌ల్లో పాకిస్థాన్ చిత్తుగా ఓడుతుంది. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది.




# గిల్‌కు గాయం!

సౌతాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్ట్‌లో టీమిండియాకు బిగ్ షాక్ తగిలింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మెడ నొప్పితో మైదానం వీడాడు. వాషింగ్టన్ సుందర్(29) ఔటైన వెంటనే నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన శుభ్‌మన్ గిల్ మూడు బంతులకే పెవిలియన్ బాట పట్టాడు. తొలి రెండు బంతులను డాట్ చేసిన గిల్.. మూడో బంతిని స్లాగ్ స్వీప్ షాట్‌తో బ్యాక్‌వార్డ్ స్క్వేర్ దిశగా బౌండరీ బాదాడు. అయితే ఈ షాట్ ఆడిన అనంతరం అతను మెడ నొప్పితో బాధపడ్డాడు. ఫిజియోలు వచ్చి మాట్లాడగా.. బ్యాటింగ్ చేయలేనని చెప్పాడు. దాంతో రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడాడు. గిల్ గైర్హాజరీలో వైస్ కెప్టెన్ రిషభ్ పంత్ జట్టును నడిపించనున్నాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
ఆదివారం 16-11-2025 | www.evarthalu.com




# ఏఐపై నియంత్రణ అవసరమా?

ఆధునిక ప్రపంచంలో కృత్రిమ మేధస్సు విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోంది. వైద్యం, విద్య నుంచి రక్షణ రంగం వరకూ అన్నింటినీ ప్రభావితం చేస్తున్న ఏఐ, మానవాళికి అపారమైన ప్రయోజనాలను అందిస్తున్నప్పటికీ, దానిపై సరైన నియంత్రణ ఉండాల్సిన ఆవశ్యకత పెరిగింది. లేకపోతే, ఈ సాంకేతికత అదుపు తప్పి, సమాజానికి, వ్యక్తిగత గోప్యతకు, చివరికి దేశ భద్రతకు కూడా పెనుముప్పుగా మారే ప్రమాదం ఉంది. ఏఐ వ్యవస్థలు వాటికి శిక్షణ ఇచ్చిన డేటా ఆధారంగా పనిచేస్తాయి. ఈ డేటాలో అంతర్లీనంగా సామాజిక వివక్ష ఉంటే, ఏఐ నిర్ణయాలు కూడా అదే వివక్షతో కూడి ఉంటాయి.

ఫలితంగా, ఉద్యోగ ఎంపికలు, రుణాలు మంజూరు చేయడం లేదా క్రిమినల్ జస్టిస్ వంటి కీలక రంగాలలో కొన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరగవచ్చు. దీనిని నివారించడానికి నియంత్రణ అవసరం. అదే విధంగా వ్యవస్థలు పనిచేయడానికి పెద్ద మొత్తంలో వ్యక్తిగత సమాచారం అవసరం. ఈ డేటాను సేకరించే, నిల్వ చేసే విధానంలో గోప్యతా ఉల్లంఘనలు జరిగే అవకాశం ఉంది. వినియోగదారుల వ్యక్తిగత వివరాలు దుర్వినియోగం కాకుండా కాపాడటానికి కఠినమైన నియంత్రణలు తప్పనిసరి. కొన్ని రకాల పనులు, ముఖ్యంగా పునరావృతమయ్యే పనులను ఏఐ ఆటోమేట్ చేయడం ద్వారా మానవ వనరుల అవసరాన్ని తగ్గించి, పెద్ద ఎత్తున నిరుద్యోగానికి దారితీయవచ్చు. ఈ పరివర్తనను సాఫీగా నిర్వహించడానికి, కార్మికులకు శిక్షణ ఇవ్వడానికి, సామాజిక భద్రతా వలయాలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ జోక్యం, నియంత్రణ కీలకం. స్వయం-ప్రతిపత్తి గల ఆయుధ వ్యవస్థల వినియోగం నైతికంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మానవ ప్రమేయం లేకుండా లక్ష్యాలను ఎంచుకుని, కాల్పులు జరిపే ఈ వ్యవస్థలపై నియంత్రణ లేకపోతే, ప్రపంచవ్యాప్తంగా అస్థిరత పెరిగిపోయే ప్రమాదం ఉంది. ఒక ఏఐ వ్యవస్థ తప్పు చేసినా లేదా నష్టాన్ని కలిగించినా, ఎవరు బాధ్యత వహించాలి అనే ప్రశ్న తలెత్తుతోంది. ఏఐ నిర్ణయాలు ఎలా తీసుకోబడుతున్నాయో అర్థం చేసుకోవడానికి పారదర్శకత అవసరం. చట్టపరమైన బాధ్యత, పారదర్శకత కోసం నిబంధనలు రూపొందించడం తక్షణ కర్తవ్యం. మన దేశం విషయానికి వస్తే భారతదేశంలో ఏఐ వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, ప్రభుత్వం ఇప్పటికే జాతీయ ఏఐ వ్యూహంపై దృష్టి సారిస్తోంది. ప్రజల ప్రయోజనాలను కాపాడడానికి, అదే సమయంలో ఏఐ ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి సమతుల్యమైన విధానం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. నియంత్రణ అనేది ఏఐ అభివృద్ధిని అడ్డుకోకూడదు, బదులుగా మానవ-కేంద్రీకృతమైన, బాధ్యతాయుతమైన ఏఐ వ్యవస్థల రూపకల్పనకు మార్గనిర్దేశం చేయాలి. లేకపోతే, సాంకేతికత అందించే అపారమైన ప్రయోజనాలను పక్కన పెట్టి, ప్రమాదకరమైన పరిణామాలను ఆహ్వానించినట్లవుతుంది. భారత్ ప్రస్తుతం ఏఐని నియంత్రించడం కంటే, దానిని సామాజిక ప్రయోజనాల కోసం ఉపయోగించడాన్ని ప్రోత్సహించడానికి దృష్టి సారిస్తోంది. ప్రస్తుతానికి ఏఐ కోసం ప్రత్యేక చట్టం లేదు. ఉన్న డేటా ప్రొటెక్షన్ చట్టం ఏఐ వినియోగంలో వ్యక్తిగత గోప్యత అంశాలను పరోక్షంగా పర్యవేక్షిస్తుంది. అయితే, భారత్ ఏఐ అభివృద్ధిని ప్రోత్సహిస్తూనే, నైతికత, భద్రత, జవాబుదారీతనం వంటి అంశాలపై దృష్టి సారించాలి. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలి.



రణధీర్ గుండు




# ప్రజాస్వామ్యానికి కేరాఫ్ పత్రిక రంగం

**(నేడు జాతీయ పత్రిక దినోత్సవం)**

మన దేశంలో ఏటా నవంబర్ 16న జాతీయ పత్రిక దినోత్సవం జరుపుకుంటారు. 1956లో భారత తొలి ప్రెస్ కమిషన్ సిఫార్స్ మేరకు 1966 నవంబర్ 16 వ తేదిన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేసారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం నవంబర్ 16వ తేదిన జాతీయ పత్రికా(నేషనల్ ప్రెస్ డే) దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఒక దేశంలో ప్రజాస్వామ్యం సక్రమంగా పనిచేస్తున్నదీ లేనిదీ తెలుసుకోవాలంటే ఆ దేశంలో పత్రికా రంగాన్ని పరిశీలిస్తే చాలు. పత్రికా రంగం మీద ఎటువంటి ఆంక్షలు లేకుండా పత్రికా స్వాతంత్ర్యం అమలవుతుంటే ఆ దేశంలో ప్రజాస్వామ్య పాలనకు, చట్టబద్ధపాలనకు ఢోకాలేనట్టే. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా.. పత్రికారంగాన్ని పరిశీలించటంతో పాటు వార్తల తీరుతెన్నులపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వృత్తిపరమైన అక్రమాలకు పాల్పడిన పత్రికలు, సంస్థల చర్యలను విమర్శించటం, అభిశంసించటం, చర్యలకు సిఫార్సు చేస్తుంది. పత్రికా స్వేచ్ఛ కోసం పనిచేయాలన్నది లక్ష్యం. ప్రపంచంలో అనేక దేశాలలో ప్రెస్ కౌన్సిళ్లు ఉన్నాయి. అయితే మన దేశ కౌన్సిల్‌కు ఉన్న ప్రత్యేకత ఏంటంటే ప్రభుత్వశాఖలపై కూడా తన అధికారాన్ని వినియోగించే అవకాశం కలిగి ఉంది. పత్రికలు, మీడియా స్వయంగా ఉన్నత ప్రమాణాలను నిర్ణయించుకొని అమలు జరిపే విధంగా ప్రెస్‌కౌన్సిల్ ప్రోత్సహిస్తుంది.

# హిట్ అండ్ రన్.. శిక్షలు

దేశవ్యాప్తంగా తరచుగా చర్చనీయాంశమవుతున్న 'హిట్ అండ్ రన్' కేసుల్లో భారతీయ చట్టం కఠినంగా వ్యవహరిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన కొత్త క్రిమినల్ చట్టాల నేపథ్యంలో, పాత చట్టంతో పోలిస్తే శిక్షలు గణనీయంగా పెరిగాయి. ఒక వాహన డ్రైవర్ ప్రమాదం జరిగిన తరువాత గాయపడిన వ్యక్తికి సహాయం అందించకుండా లేదా పోలీసులకు సమాచారం ఇవ్వకుండా సంఘటనా స్థలం నుంచి పారిపోతే, దానిని 'హిట్ అండ్ రన్' కేసుగా పరిగణిస్తారు.



ఇంతకుముందు అమల్లో ఉన్న ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) స్థానంలో వచ్చిన 'భారతీయ న్యాయ సంహిత' ప్రకారం, హిట్ అండ్ రన్ కేసుల్లో శిక్షలు భారీగా పెరిగాయి. పాత ఐపీసీ సెక్షన్ 304ఏ కింద నిర్లక్ష్యం వల్ల మరణం సంభవిస్తే గరిష్టంగా రెండేళ్ల జైలు శిక్ష మాత్రమే ఉండేది. కొత్త చట్టం ఈ శిక్షను గణనీయంగా పెంచింది.

**శిక్షలు ఇలా..**

- సెక్షన్ 106(2) – నిర్లక్ష్యంగా వాహనం నడిపి మరణానికి కారణమై, పోలీసులకు/మేజిస్ట్రేట్‌కు సమాచారం ఇవ్వకుండా పారిపోతే 10 ఏళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది. అంతేకాదు రూ.7 లక్షల వరకు జరిమానా కూడా విధిస్తారు.
  సెక్షన్ 106(1)- నిర్లక్ష్యంగా వాహనం నడిపి మరణానికి కారణమై,
- డ్రైవర్ స్వచ్ఛందంగా పోలీసులకు/మేజిస్ట్రేట్‌కు సమాచారం
- ఇస్తే 5 ఏళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా ఉంటుంది.

**బాధితులకు పరిహారం**

- మోటారు వాహనాల చట్టంలోని ప్రత్యేక నిబంధనల ప్రకారం, హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు కేంద్ర ప్రభుత్వం పరిహారం అందిస్తుంది.
- మరణం సంభవిస్తే: బాధిత కుటుంబానికి రూ. 2 లక్షల పరిహారం.
- తీవ్ర గాయాలైతే: బాధిత వ్యక్తికి రూ.50,000 పరిహారం. ఈ పరిహారం కోసం బాధితులు లేదా వారి కుటుంబ సభ్యులు, ప్రమాదం జరిగిన వివరాలతో కూడిన ఫారం (ఫారం-1) ద్వారా పోలీసులకు లేదా జిల్లా అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి.



# సహనానికీ ఒకరోజు

**(నేడు అంతర్జాతీయ సహన దినోత్సవం)**

సహనానికీ ఓ హద్దు ఉంటుంది. మా సహనాన్ని పరీక్షించొద్దు. ఇలాంటి డైలాగ్స్‌తో ఏమీ సాధించలేం అని చెప్తోంది ఐక్యరాజ్య సమితి. నిజానికి సహనం కోల్పోయి ఎదురుదాడి చేయడం అనేది సమస్యకు పరిష్కారం కాదు. ఒకరు చెడు చేస్తున్నారని మనము వారికి చెడు చేయాలని చూస్తే అది ఇరు వర్గాలకి నష్టమే. కూల్చటం సులభమే కానీ నిర్మించటమే కష్టం. అది నిర్మాణాలనైనా.. మనుషులనైనా. సహనం నశిస్తే అది హింసకు దారితీస్తుంది. మహాత్మాగాంధీ శాంతి మార్గంలో వెళ్లి స్వేచ్ఛను అందించాడు. అందుకే ఆయన మహాత్ముడు అయ్యాడు. ప్రతి ఏడాది నవంబర్ 16వ తేదీని 'ప్రపంచ సహనం దినోత్సవం' గా ఐక్యరాజ్య సమితి నిర్వహిస్తోంది. సహనం కోల్పోతే వచ్చే నష్టాలను చాటి చెప్పడమే ఈరోజు ముఖ్య ఉద్దేశ్యం.

# ఫోన్ రికార్డింగ్ చట్టబద్ధమా?

కొంతమంది తమ ఫోన్లలో కాల్ రికార్డింగ్ ఆప్షన్ పెట్టుకొని రికార్డు చేస్తుంటారు. ఆ విషయం అవతలి వాళ్లకు తెలియదు. అదేవిధంగా ఎవరైనా ఇద్దరు మాట్లాడుకుంటుంటే కొంతమంది థర్డ్ పార్టీ యాప్‌ల ద్వారా ఫోన్ సంభాషణలను వింటుంటారు. అయితే, ఇలా చేయడం కరెక్టేనా? అంటే.. భారత రాజ్యాంగం ఆర్టికల్ 21 ప్రకారం చట్టరీత్యా నేరం.

జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛను రాజ్యాంగం ప్రసాదించింది. అందువల్ల అవతలివారి జీవించే హక్కును, స్వేచ్ఛను కాలరాస్తే అందుకు శిక్షకు అర్హులే. అదేవిధంగా, భారత టెలిగ్రాఫ్ యాక్ట్ - 1885 ఆర్టికల్ 25 ప్రకారం.. కాల్ రికార్డింగ్ అనేది నేరం. అందుకు 3 సంవత్సరాల వరకు శిక్ష పడొచ్చు. జరిమానా విధించే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో శిక్ష, జరిమానా రెండూ పడొచ్చు. అయితే ప్రభుత్వ ఆధీనంలోని సంస్థలు కొన్ని సందర్భాల్లో మాత్రమే ఫోన్ రికార్డింగ్ చేసేందుకు అవకాశం ఉంది. సాధారణ పౌరులకు ఆ హక్కు లేదు.

కోర్టులో రికార్డ్ చేసిన ఆధారం చెల్లుతుందా?

ఆధారాలు సమర్పించే విషయంలో కోర్టులు కొన్ని కీలక విషయాలు వెల్లడించాయి. కాల్ రికార్డింగ్ నేరమే అయినా, దాని సంబంధిత ఆధారాన్ని సమర్పించేందుకు న్యాయస్థానాలు అనుమతి ఇస్తాయి. చట్ట వ్యతిరేకంగా ఆధారాలు సేకరించినా, ఆ ఆధారం కోర్టులో చెల్లుతుంది అన్నది కోర్టు సారాంశం. కాకపోతే, అనధికారిక కాల్ రికార్డింగ్‌కు కోర్టులు శిక్ష విధిస్తాయి.




## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.